నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
1
మంగళవారం | 09 జనవరి 2024 | www.navatelangana.com

సిద్దిపేట సీపీగా బాధ్యతలు చేపట్టిన అనురాధ

నవ తెలంగాణ సిద్దిపేట అర్బన్



సిద్దిపేట నూతన పోలీస్ కమిషనర్‌గా డాక్టర్ బి.అనురాధ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా కమిషనరేట్‌లో పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అడిషనల్ డీసీపీలు, ఏసీపీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా భౌగోళిక పరిస్థితులు, ఏ తరహా నేరాలు ఎక్కువగా నమోదవుతున్నాయి? పలు అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, సిద్దిపేట ప్రిన్సిపల్ డిస్టిక్ అండ్ సెషన్స్ జడ్జ్ డాక్టర్ టి.రఘురామ్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. అంతకుముందు ఆమెకు అడిషనల్ డీసీపీలు అందె శ్రీనివాసరావు, ఎస్ మల్లారెడ్డి, ఏ ఆర్ అడిషనల్ డీసీపీలు రామ్ చంద్రరావు, సుభాష్ చంద్రబోస్, ఏసీపీలు, సీఐలు స్వాగతం పలికారు.

హైకోర్టు ఆదేశాల ప్రకారం రైతుల భూముల్లో వెళ్లొద్దు



నవతెలంగాణ - ఝరాసంగం: ఝరాసంగం మండలం ఎల్గోయి గ్రామంలోని 108 మంది రైతులు హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు స్టే ఆర్డర్ ప్రకారం రెవెన్యూ అధికారులు, టీఎస్ఐఐసీ అధికారులు రైతుల భూముల్లోకి ప్రవేశించరాదు' అని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బి రామచందర్ అన్నారు. గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల్ని బెదిరించి భయాందోళనకు గురి బలవంతంగా వారి భూములను లాక్కున్నారని ఆరోపించారు. చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరించిన దానికి నిరసనగా అనేక ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించినా పట్టించుకోలేదని తెలిపారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల సానుకూలంగా స్పందించి ప్రస్తుతం పట్టా భూమికి ఎంతైతే పరిహారం చెల్లిస్తున్నారో అంత చెల్లించి రైతులను ఆదుకోవాలని కోరారు. న్యాయం జరగని పక్షంలో పోరాటానికి సిద్ధంగా ఉండాలని రైతులకు పిలుపునిచ్చారు. రైతులందరూ కలిసికట్టుగా ఉంటే కచ్చితంగా విజయం సాధిస్తామని, రైతులకు అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శంకర్, గోపాల్, యేసయ్య, అంజమ్మ, నర్సింలు, తుల్జమ్మ, రాములు, లక్ష్మి, క్రిష్ణ, శాంతమ్మ, నారాయణ, కిష్టన్న, సాబేర్ తదితరులు పాల్గొన్నారు.

పనులు రద్దు చేయొద్దు

- బసవేశ్వర, సంగమేశ్వర పనులు కొనసాగించాలి
- జెడ్పీలో ఏకగ్రీవ తీర్మానం.. ప్రభుత్వానికి నివేదన
- భూ కబ్జాలను అరికట్టాలని సభ్యుల డిమాండ్
- సీఎస్ఆర్ ఫండ్స్ విషయంలో కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ సభ్యుల వాగ్వాదం
- జిల్లాలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికే ఖర్చు
- జెడ్పీ సర్వసభ్య సమావేశంలో వాడీవేడి చర్చ
- ప్రతినిధులందరికీ ప్రాధాన్యతివ్వాలి: బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు
- పార్టీలు కాదు.. ప్రజల సంక్షేమం, అభివృద్ధే ప్రాధాన్యం: కాంగ్రెస్ ఎమ్మెల్యే
- సమన్వయంలో ప్రజా సమస్యల పరిష్కారం: కలెక్టర్ వల్లూరు క్రాంతి
- గౌరవించాలని బీఆర్ఎస్ సభ్యులు



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

గత ప్రభుత్వంలో నిధులు మంజూరు చేసి ప్రారంభించకుండా ఉన్న ఎస్డీఎఫ్ పనులను రద్దు చేయాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. అదే విధంగా వెనుకబడిన ప్రాంతాలకు సాగునీటిని అందించేందుకు చేపట్టిన సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులను కొనసాగించాలని సభ్యులు కోరారు. సోమవారం జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి అధ్యక్షతన జెడ్పీ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారిగా జరిగిన జెడ్పీ సమావేశంలో ఎస్డీఎఫ్ పనులు రద్దు, సీఎస్ఆర్ నిధుల కేటాయింపు విషయాలపై కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ సభ్యుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. రాజకీయాలు, పార్టీలను చూడకుండా ప్రజల సంక్షేమం, అభివృద్ధికే ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజా ప్రతినిధులందర్నీ సమంగా గౌరవించి ప్రాధాన్యత ఇవ్వాలని బీఆర్ఎస్ సభ్యుల కోరారు. గత ప్రభుత్వం మాదిరి కాకుండా ప్రజల సంక్షేమం, జిల్లా అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చి తమ ప్రభుత్వం పనిచేస్తుందని కాంగ్రెస్ సభ్యులు స్పష్టం చేశారు. జెడ్పీ సమావేశంలో పంచాయతీరాజ్, విద్య, వైద్యం, వ్యవసాయం, నీటిపారుదల, ఉపాధి హామీ, పశుసంవర్ధక, ఆర్ అండ్ బీ, మిషన్ భగీరథ, రెవెన్యూ, ఐసీడీఎస్ వంటి శాఖలపై సమీక్షించారు. వివిధ శాఖలపై జరిగిన చర్చల సందర్భంగా పలువురు జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎమ్మెల్యేలు కొన్ని సమస్యల్ని సమావేశం దృష్టికి తెచ్చారు. ముఖ్యంగా జిల్లాలోని గుమ్మడిదల, హత్నూర, జిన్నారం, నారాయణఖేడ్ వంటి ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయని పలువురు జెడ్పీటీసీలు పేర్కొన్నారు. కొన్ని చోట్ల పేదలకు పట్టాలిచ్చిన భూముల్ని పొజిషన్ చూపలేదని, పొజిషన్‌లో ఉన్న భూములకు పట్టాలివ్వలేదని గుమ్మడిదల, జిన్నారం జెడ్పీటీసీలు చర్చకుపెట్టారు. గుమ్మడిదల మండలంలో అన్నారంలో 118 మందికి అసైన్డ్ చేసిన భూములకు కొందరికే పాస్‌పుస్తకాలిచ్చారని, మరో గ్రామంలోని 109 సర్వే నెంబర్‌లో 160 ఎకరాల్ని అసైన్డ్ చేశారని, ఇప్పటికీ కొందరికి పాసుపుస్తకాలివ్వలేదని, అట్టి ఫైల్స్ కలెక్టరేట్‌లో పెండింగ్‌లో ఉన్నందున కలెక్టర్ వెంటనే క్లియర్ చేయాలని కోరారు. వైద్య ఆరోగ్య శాఖపై జరిగిన చర్చలో జోగిపేట ఆసుపత్రిలో ప్రసూతి సేవలకు పోయిన పేషెంట్లకు మహిళా డాక్టర్ వైద్యం చేయడంలో నిర్లక్ష్యం చేస్తుందని వెంటనే ఆమెపై చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ డిమాండ్ చేశారు. కల్హేర్ జెడ్పీటీసీ నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ కల్హేర్ పీహెచ్‌సీని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా అప్‌గ్రేడ్ చేసినప్పటికీ సరిపడ సిబ్బందిని నియమించలేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి స్పందిస్తూ ఆరోగ్య శాఖ మంత్రితో ఇప్పటికే మాట్లాడామని, త్వరలోనే సరిపడ సిబ్బందిని ప్రభుత్వం నియమించనుందన్నారు. నారాయణఖేడ్ నియోజకవర్గ పరిధిలో వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులు సిటీకి దగ్గరగా డిప్యూటేషన్లపై పనిచేస్తున్నారని, వీరందర్నీ వెంటనే స్వంత ప్రాంతాలకు మార్పు చేయాలని అధికారుల్ని కోరారు. మిషన్‌భగీరథ ఎజెండాలో జహీరాబాద్ మండలంలోని అర్జున్‌తండాలో బోరు వేసినప్పటికీ పైప్‌లైన్ వేసేందుకు ఎస్టిమేట్ వేయడంతో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు.

సీఎస్ఆర్ నిధులపై వాగ్వాదం

వైద్య ఆరోగ్య శాఖపై చర్చ సందర్భంగా సీఎస్ఆర్ నిధుల విషయంలో కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ సభ్యుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కొండాపూర్ ఎంపీపీ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలోని ఆసుపత్రి భవనం శిథిలావస్థలో ఉన్నదని, మండలంలోని కంపెనీల నుంచి వస్తే సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి చేయాలని కోరారు. అదే విధంగా గత ప్రభుత్వంలో సీఎస్ఆర్ నిధుల్ని సంగారెడ్డి జిల్లా నుంచి సిరిసిల్లకు తరలించుకుపోయారంటూ ఆరోపించారు. దీంతో బీఆర్ఎస్‌కు చెందిన జెడ్పీటీసీలు దయాకర్‌రెడ్డి, ప్రభాకర్ జోక్యం చేసుకున్నారు. నిన్నటి వరకు మనోహర్‌రెడ్డి బీఆర్ఎస్‌లో ఉండి మంత్రి హరీశ్‌రావు చుట్టు తిరిగాడని, కాంగ్రెస్‌లోకి పోయాక గత ప్రభుత్వం ఆరోపణలు చేయడం తగదని అభ్యంరతం తెలిపారు. గతంలో జిల్లా మంత్రితో సన్నిహితంగా ఉన్న మనోహర్‌రెడ్డి అప్పట్లో ఎందుకు సీఎస్ఆర్ నిధుల గురించి మాట్లాడలేదని ప్రశ్నించారు. దీనికి మనోహర్‌రెడ్డి స్పందిస్తూ గత ప్రభుత్వం ఎంపీపీలే కాదు ఎమ్మెల్యేలు కూడా మాట్లాడలేకపోయారని గుర్తు చేశారు. దయాకర్‌రెడ్డికి ఏం తెల్వదని అనడడంతో బీఆర్ఎస్ సభ్యులు మూకుమ్మడిగా అభ్యంతరం తెలుపుతూ మనోహర్‌రెడ్డి వాఖ్యల్ని ఖండించారు. రెండు వైపుల నుంచి వాగ్వాదం చోటు చేసుకోవడంతో జెడ్పీ చైర్మన్ మంజుశ్రీ జోక్యం చేసుకుని సర్దిచెప్పారు. గత ప్రభుత్వం అన్ని పార్టీల సభ్యుల్ని సమంగా గౌరవించి అందరికీ సమానంగా నిధులు కేటాయించామని, మనోహర్‌రెడ్డి ఇలా పక్షపాతంగా మాట్లాడడం సమంజసం కాదని ఆమె పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ సీఎస్ఆర్ నిధుల్ని జిల్లా అభివృద్ధి కోసమే ఖర్చు చేయాలని కోరారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేటాయించాలని, జిల్లాలోని అన్ని ప్రాంతాలకు ప్రాధాన్యత ఇచ్చి కలెక్టర్ సమక్షంలో నిధుల్ని కేటాయించాలని సూచించారు. కోహీర్ పిరమిడ్ కంపెనీ వాళ్ల సీఎస్ఆర్ నిధులు కేటాయించాని అడిగినప్పుడు నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారని జెడ్పీటీసీ అన్నారు. కలెక్టర్ జోక్యం చేసుకుని కంపెనీపై చర్యలు తీసుకోవాలన్నారు.

నిధులు కేటాయించిన పనుల్ని రద్దు చేయొద్దు

గత ప్రభుత్వం జిల్లా అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ఎస్డీఎఫ్, ఎన్ఆర్ఈజీఎస్, ఎస్‌జీఎఫ్ నిధులతో మంజూరు చేసిన పనుల్ని రద్దు చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ విషయంపై జెడ్పీ సమావేశం ప్రారంభంలో చర్చకు పెట్టారు. వివిధ నిధుల కింద గ్రామ పంచాయతీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, రోడ్ల మరమ్మతుల కోసం నిధులు కేటాయించి మంజూరు చేసిన పనుల్ని రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకొని మంజూరైన పనుల్ని కొనసాగించాలని కోరుతూ జెడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. జిల్లాలో సుమారు 635 కోట్లతో వివిధ పనులు మంజూరయ్యారని, వాటిల్లో చాలా వరకు పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. కొన్ని అగ్రిమెంట్ అయి పనులు ప్రారంభం కాలేదన్నారు. వీటన్నిటినీ ఆపడం వల్ల కాంట్రాక్టర్లు కోర్టుకు వెళ్లితే పనులన్నీ ఆగిపోయి ప్రజలకు ఇబ్బందులేర్పనున్నందున ప్రభుత్వం గతంలో మంజూరైన పనుల్ని కొనసాగించాలని తీర్మానంలో పేర్కొన్నారు. ఇట్టి తీర్మానాన్ని జెడ్పీ చైర్ పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి ఆమోదిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి పంపుతామని పేర్కొన్నారు. అదే విధంగా నారాయణఖేడ్, జహీరాబాద్ నియోజకవర్గాలకు సాగునీరు అందించేందుకు చేపట్టిన బసవేశ్వర, సంగమేశ్వర ప్రాజెక్టులను రద్దు చేయకుండా కొనసాగించి పూర్తి చేయాలని జెడ్పీటీసీ రాజు రాథోడ్ తీర్మానం పెట్టారు. ఈ సమావేశంలో ఎంపీ బీబీపాటిల్, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎమ్మెల్యేలు సునీతాలక్ష్మారెడ్డి, చింత ప్రభాకర్, మాణిక్యరావు, సంజీవరెడ్డి, కలెక్టర్ వల్లూరి క్రాంతి, జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వ్యక్తులు కాదు వ్యవస్థలు ముఖ్యం: సునీతా లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే నర్సాపూర్



వ్యక్తులు, పార్టీలు ముఖ్యం కాదని, వ్యవస్థలు శాశ్వతం. ప్రభుత్వం మారిందని గత ప్రభుత్వంలో మంజూరు చేసిన పనుల్ని రద్దు చేయడం తగదు. దళిత, బీసీ, మైనార్టీ బంధు, సబ్సిడీ గొర్రెల పథకాన్ని కూడా ఈ ప్రభుత్వం కొనసాగించాలి. అగ్రిమెంట్ చేసిన పనుల్ని రద్దు చేయడం వల్ల న్యాయ చిక్కులొచ్చి పనులకు ఆటంకాలేర్పడతాయి. జిల్లా మంత్రి జోక్యం చేసుకుని గతంలో నిధులిచ్చి మంజూరు చేసిన పనులన్నీ చేసేటట్లు చర్యలు తీసుకోవాలి. జిల్లాలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల విషయంలో అధికారులు ప్రోటోకాల్ పాటించేలా కలెక్టర్ జోక్యం చేసుకోవాలి.

అన్ని నియోకజవర్గాలకు ప్రాధాన్యతివ్వాలి: చింత ప్రభాకర్, ఎమ్మెల్యే సంగారెడ్డి



జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు ప్రాధాన్యత ఇచ్చి నిధులివ్వాలి. గతంలో చేపట్టిన అభివృద్ధి పనుల్ని కొనసాగించాలి. సంక్షేమ పథకాల్ని కూడా అమలు చేయాలి. ఆరు గ్యారంటీలను అర్హులైన లబ్దిదారులకు అందించాలి. రాజకీయ పక్షపాతం చూపకుండా అందర్నీ సమంగా చూడాలి. పనుల్ని రద్దు చేయడం కాకుండా ఇంకొన్ని నిధుల్ని మంజూరు చేయించాలి.

ప్రశాంతతను కాపాడుకుందాం: మాణిక్యరావు, ఎమ్మెల్యే జహీరాబాద్



ప్రశాంతమైన వాతావరణాన్ని కాపాడుకుందాం. రాజకీయా వైరుధ్యాలను పెంచొద్దు. ఇతర ప్రాంతాల నుంచి జిల్లాలో పరిశ్రమలు, ఇతర పెట్టుబడులు పెట్టేందుకు అనేక మంది పారిశ్రామిక వేత్తలు వస్తున్నారు. మనందరం సఖ్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యపడుతుంది. పార్టీలు వేరనా ప్రజల సంక్షేమం, జిల్లా అభివృద్ధియే ప్రధానం. ఇటీవల ఆత్మహత్య చేసుకున్న గురుకుల బాలిక కుటుంబానికి న్యాయం చేయాలి.

సంక్షేమం, అభివృద్ధే ప్రాధాన్యం: సంజీవరెడ్డి, ఎమ్మెల్యే, నారాయణఖేడ్



పార్టీలు ముఖ్యం కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధే ప్రధానంగా బావిస్తుంది. గత ప్రభుత్వం మాదిరి రాజకీయ పక్షపాతం చూపబోం. ప్రజా ప్రతినిధులందరికీ గౌరవం దక్కుతుంది. అర్హులైన వాళ్లకు తప్పకుండా సంక్షేమ పథకాల్ని అందిస్తాం. ఆరు గ్యారంటీల విషయంలో అర్హులైన వాళ్లందరికీ రాజకీయాలకు అతీతంగా మంజూరవుతాయి.

సమన్వయంతో ప్రజా సమస్యల పరిష్కారం: వల్లూరి క్రాంతి, కలెక్టర్



అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయడం ద్వారా ప్రజా సమస్యల్ని పరిష్కరిద్దాం. సభలో సభ్యులు ప్రస్తావించిన సమస్యల్ని ఆయా శాఖల అధికారుల ద్వారా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. గ్రామాభివృద్ధిలో కీలకమైన నీటి సరఫరా పారిశుద్ధ్యం సజావుగా జరిగేలా చూస్తామన్నారు. అంగన్వాడీలు, పాఠశాలు, ఆసుపత్రుల నిర్వహణ బాగా జరిగేలా పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓలు, అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పేదల భూములు కబ్జా

- అక్రమ పద్ధతిలో ఐదెకారలు కాజేసే యోచన
- ఎమ్మెల్యే అనుచరులమంటూ బెదిరింపులు
- 50 ఏళ్లుగా భూములే జీవనాధారం: పేదలు





నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

పేదల భూములపై కబ్జా కోరులు పంజా విసురుతున్నారు. ప్రజా నిధుల అండదండలతో రైతుల భూముల్ని కాజేసేందుకు పూనుకున్నారు. కోట్ల విలువ చేసే భూములకు దొడ్డిదారిన పాసుపుస్తకాలు సృష్టించి ఆక్రమించేస్తున్నారు. భూములపై కన్నేయడం, లిటిగేషన్లు సృష్టించడం, కబ్జా చేసి కాజేయడం పరిపాటిగా సాగుతుంది. అసైన్డ్ భూములే కాదు పట్టా భూములు, సాగు భూముల్ని సైతం కాజేస్తూ బెదిరింపుల పర్వానికి దిగుతున్న వైనం జిల్లా వ్యాప్తంగా కొనసాగుతుంది. జిల్లాలోని హత్నూర మండలంలోని చింతల చెర్వు గ్రామంలో కొందరు రైతులు సాగు చేసుకుంటున్న భూమిని కాజేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారు. 338, 339, 293 ఇలా ఇతర సర్వే నెంబర్లలో ఉన్న భూముల్ని తమ భూములుగా చూపుతూ కబ్జా చేస్తున్నారు. పటాన్‌చెరు ప్రాంతానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు దొడ్డిదారిన పాసుపుస్తకాలు సృష్టించి పేద రైతులు సాగు చేసుకుంటున్న భూమిని తమదంటూ బెదిరిస్తూ ఆక్రమించేస్తున్నారు. చిన్న సన్నకారు రైతులకు చింతలచెరులో భూములున్నాయి. 338, 292 ఇతర సర్వే నెంబర్లలో సుమారు 5.20 ఎకరాల భూమి తమదంటూ కొందరు రైతుల్ని బెదిరిస్తున్నారు. వాస్తవంగా ఆ ఊరికి చెందిన పలువురు పేదలు 50 ఏళ్లుగా ఆ సర్వే నెంబర్లలో గత భూముల్ని సాగు చేసుకుంటున్నారు. రెండు తరాలుగా ఆ భూములే జీవనాధారంగా పదుల కుటుంబాలు జీవిస్తున్నాయి. ఏళ్లతరబడిగా ఆ భూముల్ని నమ్ముకుని బతుకుతున్న పేద రైతుల నోట్లో మట్టికొట్టేందుకు కొందరు కుట్ర పన్నారు. అవే సర్వే నెంబర్లలో తాము భూములు కొన్నామంటూ రైతుల భూముల్లోకి వచ్చారు. తాము కొనుగోలు చేసిన భూమిలోంచి వెళ్లిపోవాలంటూ రైతుల్ని బెదిరించి వెల్లగొట్టేందుకు పూనుకున్నారు. ఎన్నికల ముందే ఈ భూముల్లోకి వచ్చారు. తాము పటాన్‌చెరు ఎమ్మెల్యే అనుచరులమంటూ బెదిరించారు. దీంతో స్థానిక రైతులు నర్సాపూర్ అప్పటి ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. రైతుల భూముల విషయంలో స్పందించిన మదన్‌రెడ్డి తన నియోజకవర్గం పరిధిలో ఇలాంటి వ్యవహారాలు నడవని చెప్పడంతో ఆక్రమణ కోసం వచ్చిన వాళ్లు వెళ్లిపోయారు. అసెంబ్లీ ఎన్నికలుండడంతో సదరు వ్యక్తులు కాముగా ఉండిపోయారు. ఎన్నికలు పూర్తయ్యే సరికి మళ్లీ అదే పద్ధతిలో భూమిలోకి వచ్చి కబ్జా చేశారు. దీంతో స్థానిక రైతులు అడ్డుకున్నారు. కబ్జాదారులు మాత్రం తమకు పట్టాదారు పాసుపుస్తకాలున్నాయంటూ పోలీసుల సహకారంతో భూమిలోకి వచ్చారు. ఎన్నో ఏళ్లుగా భూమిని నమ్ముకుని బతుకుతున్న తమకు అన్యాయం చేయొద్దంటూ రైతులు వేడుకున్నా ఆక్రమణ దారులు పట్టించుకోవడంలేదు. దీంతో సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన జెడ్పీ సమావేశానికి హాజరైన నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, జిల్లాకు నూతనంగా వచ్చిన కలెక్టర్ వల్లూరి క్రాంతి కాళ్లమీద పడి తమ భూమిని కబ్జాదారుల నుంచి కాపాడాలంటూ వేడుకున్నారు. తమ భూముల్ని తమకు దక్కేలా చూడాలని కోరారు. రైతులు కన్నీరు పెడుతూ కలెక్టర్, ఎమ్మెల్యే కాళ్లమీదపడి వేడుకోవడంతో స్పందించిన కలెక్టర్ వల్లూరు క్రాంతి భూమి వివాదంపై విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చారు.

ఎకరన్నర కబ్జా చేశారు: క్రిష్ణగౌడ్

తనకు ఉన్న భూమిలో ఎకరన్నర వరకు కబ్జా చేశారు. 338 సర్వే నెంబర్‌లో తనకున్న భూమిలోంచి 1.20 ఎకరాలు తమదంటూ రియల్టర్లు కాజేస్తున్నారు. 50 ఏళ్లుగా భూమినే నమ్ముకుని బతుకుతున్నాం. పంటలేస్తూ జీవనం సాగిస్తున్నం. మా భూములకు వేరే వాళ్ల పట్టాపాసుపుస్తకాల్ని సృష్టించి కాజేయాలని చూస్తున్నారు. మా భూములు మాకు దక్కకుండా చేస్తున్న వాళ్లపై చర్యలు తీసుకోవాలి. కలెక్టర్ జోక్యం చేసుకుని పేదలమైన మాకు న్యాయం చేయాలి.

సీఎంఆర్ లక్ష్యాన్ని సాధించాలి





మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

నవతెలంగాణ-సంగారెడ్డి, మెదక్

నిర్దిష్ట గడువులోగా సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) లక్ష్యాన్ని సాధించేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కలెక్టర్లకు సూచించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులతో కలిసి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో సీఎంఆర్ ప్రగతిపై సమీక్షించారు. రైస్ మిల్లులకు సీఎంఆర్ కింద కేటాయించిన ధాన్యాన్ని వేగవంతంగా మిల్లింగ్ చేసి, కోటా మేరకు ఎఫ్‌సీఐకి బియ్యం నిల్వలు చేరవేసేలా పర్యవేక్షించాలన్నారు. డిసెంబర్ 31 నాటికే ఎఫ్‌సీఐకి సీఎంఆర్ కోటాను చేరవేయాల్సి ఉన్నప్పటికీ, అనేక జిల్లాలలో మిల్లింగ్ ప్రక్రియ పెద్ద ఎత్తున పెండింగ్‌లో ఉందన్నారు. ఈ నెల 21 వరకు ఎఫ్‌సీఐ గడువు పొడిగించినందున నిర్ణీత సమయంలోగా కస్టమ్ మిల్లింగ్ రైస్ నిల్వలు చేరేలా చూడాలన్నారు. రైస్ మిల్లులవారీగా పర్యవేక్షణ చేయాలని సూచించారు. మిల్లర్లు పూర్తి స్థాయి సామర్థ్యం మేరకు మిల్లింగ్ జరిపేలా కృషి చేయాలన్నారు. ప్రతి రోజు కనీసం 80 నుండి 90 శాతానికి పైగా మిల్లింగ్ నిర్వహించేలా చూడాలన్నారు. కేటాయించిన ధాన్యం నిల్వలను పరిశీలించాలన్నారు. ఎక్కడైనా పక్కదారి పట్టినట్లు, అక్రమాలకు పాల్పడినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పీడీఎస్ బియ్యం రీసైక్లింగ్‌ను నిరోధించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేద కుటుంబాలకు అందించే రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా గట్టి నిఘా ఉంచాలన్నారు. పోలీసులను సమన్వయం చేస్తూ అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని సూచించారు.

అభయహస్తం దరఖాస్తులను సకాలంలో అప్లోడ్ చేయాలి

ప్రజాపాలన కార్యక్రమం ద్వారా అభయహస్తం గ్యారంటీలకు సంబంధించి ప్రజల నుండి స్వీకరించిన దరఖాస్తులను సకాలంలో ఆన్లైన్‌లో అప్లోడ్ చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి కలెక్టర్లకు సూచించారు. ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా నిర్ణీత గడువులోగా ఆన్లైన్ నమోదు ప్రక్రియ పూర్తయ్యేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలన్నారు. రోజువారీగా నమోదు తీరును పర్యవేక్షిస్తూ, క్షేత్రస్థాయిలో ఎక్కడైనా సమస్యలను గుర్తిస్తే వాటిని పరిష్కరించాలన్నారు. సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమం ద్వారా జిల్లాలో మొత్తం 3,83,979 దరఖాస్తులు వచ్చాయని సీఎస్ దృష్టికి తెచ్చారు. వాటిలో ఇప్పటికే లక్షకుపైగా దరఖాస్తులను ఆన్లైన్‌లో నమోదు చేశామన్నారు. ముందస్తు ప్రణాళికతో దరఖాస్తులు అప్లోడ్ చేసేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. నిర్ణీత సమయంలోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఎస్ఓ వనజాత, డిపిఓ సురేష్ మోహన్, డిఆర్ఓ నగేష్, సివిల్ సప్లైస్ డి ఎం సుగుణ బాయ్ పాల్గొన్నారు.

టార్గెట్ పూర్తి చేస్తాం

మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన డైలీ టార్గెట్ ప్రస్తుతం 79 శాతం జరుగుతుందని, దానిని 100 శాతం పెంచేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్, పౌర సరాఫరాల శాఖ అధికారులతో సీఎంఆర్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి సూచనల మేరకు జిల్లాలో ఎలాంటి జాప్యం లేకుండా సీఎంఆర్ డెలివరీ టార్గెట్ పూర్తి చేయుటకు వెంటవెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. లక్ష్యాలు పూర్తి చేసే వరకు సంబంధిత మిల్లులను తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని రైస్ మిల్లర్ల వద్ద వున్న ధాన్యంను మిల్లింగ్ చేసి బియ్యం పెట్టవలసిన ఆఖరి తేదీ ఈ నెల 31 లోగా ముగుస్తుందని, ఖచ్చితంగా పొడిగించే అవకాశం లేదని మిల్లర్లు అందరూ ప్రభుత్వ ఆదేశాలు మేరకు గడువుతేదీ లోగా పాటించి బియ్యం పెట్టాలని, లేనిచో అట్టి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పౌర సరాఫరాల శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు, రెవెన్యూ) రమేష్, వెంకటేశ్వర్లు, డిసిఎస్ఓ బ్రహ్మారావు, డిఎం సివిల్ సప్లై హరికృష్ణ, ఈడిఎం సందీప్ పాల్గొన్నారు.

సంక్షేమ గురుకులాల్లో విద్యార్థుల చావులను అరికట్టాలి

కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్

నవ తెలంగాణ-సంగారెడ్డి



'సంక్షేమ గురుకులాల్లో విద్యార్థుల చావులను అరికట్టాలి. విద్యార్థుల మరణాలపై ఉన్నత అధికారులతో సమగ్ర విచారణ జరపాలి. రంజోల్ గురుకుల కాలేజీలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని కుటుంబాన్ని ఆదుకోవాలి' అని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్ కోరారు. సోమవారం సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ లో అడిషనల్ కలెక్టర్‌కు కేవీపీఎస్ ఆధ్వర్యంలో మెమొరాండం అందజేశారు. ఈ సందర్భంగా అతిమేల మాణిక్ మాట్లాడుతూ జిల్లాలోని సంక్షేమ గురుకులాల్లో విద్యార్థుల మరణాల పరంపర కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల 5 మంది విద్యార్థులు గురుకులాల్లో మృత్యువువాత పడ్డారన్నారు. అందోల్ గురుకుల కాలేజీ విద్యార్థిని అనారోగ్యంతో హాస్పిటల్లో చికిత్స పొందుతూ చనిపోయిందన్నారు. ముత్తంగిలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల కాలేజీలో విద్యార్థిని చనిపోయిందన్నారు. గిర్మాపూర్ గురుకుల కాలేజీలో విద్యార్థి ఉరేసుకొని చనిపోయాడన్నారు. సిర్గాపూర్ గిరిజన గురుకులంలో భవనం పైనుంచి పడి చనిపోయిందన్నారు. రంజోల్ సాంఘిక సంక్షేమ గురుకుల కాలేజీలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న బేగరి స్వప్న క్లాస్ రూమ్‌లోనే ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నదన్నారు. ఇంత మంది విద్యార్థులు చనిపోతున్నా అధికారులకు పట్టడం లేదన్నారు. ఈ ఘటనలను చూస్తే విద్యార్థుల మీద పర్యవేక్షణ లేదని తేలిపోయిందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనలకు గురవుతున్నారని తెలిపారు. గురుకులాల్లో పేద విద్యార్థులే చదువుకుంటున్నారని, జిల్లాలోని గురుకులాల్లో విద్యార్థుల మరణాలపై ఉన్నత అధికారులతో సమగ్ర విచారణ జరిపి విద్యార్థుల మరణాలను అరికట్టేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు. రంజోల్ గురుకుల కాలేజీలో చనిపోయిన విద్యార్థిని స్వప్న కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. మూడు ఎకరాల భూమి, ఇందిరమ్మ గృహ పథకంలో ఇల్లు మంజూరు చేయాలన్నారు. వారి పిల్లలు చదువుకునే అవకాశం ఉంటే గురుకులాల్లో ప్రత్యేక పర్మిషన్ ద్వారా సీట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ నాయకులు మచ్చేందర్, శివశంకర్ తదితరులు ఉన్నారు.

ప్రజలను పట్టించుకోని కొమ్మూరి

- ఎంపీగా ఎలా గెలుస్తాడు
- సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి

నవ తెలంగాణ కొమురవేల్లి



ఒక నియోజకవర్గ ప్రజలనే పట్టించుకోని కొమ్మూరి ప్రతాపరెడ్డి ఏడు నియోజకవర్గాల పరిధిలో ఎంపీగా ఎలా గెలుస్తాడని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి ఎద్దేవా చేశారు. సోమవారం మండల కమిటీ సమావేశం శేట్టిపల్లి సత్తిరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మల్లారెడ్డి హాజరై మాట్లాడుతూ రెండు లక్షల ఓట్లల పరిధిలో నాలుగు సార్లు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చినా గెలవని కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి భువనగిరి ఎంపీ స్థానానికి దాదాపు 16 లక్షల ఓట్లు కలిగి ఏడు నియోజకవర్గాల పరిధిలో ఎలా గెలుస్తారన్నారు. గతంలో అనేక పార్టీల ద్వారా 2009లో తెలంగాణ రాష్ట్ర సమితి నుండి పోటీ చేసి ఓడిపోయాడని, 2014లో బీజేపీ నుండి పోటీ చేసి ఓడిపోయాడని, 2018లో ఎమ్మెల్సీగా పోటీ చేసి ఓడిపోయారని, 2023లో కాంగ్రెస్ నుండి పోటీ చేసి ఓడిపోయాడని గుర్తు చేశారు. ప్రజలు అతన్ని ఓడించిన గుణపాఠం తెచ్చుకోకుండా మళ్లీ ఎంపీకి పోటీ చేస్తానని అనడం గొంతెమ్మ కోరికలు కోరడం తప్ప మరొకటి కాదన్నారు. గతంలో చేర్యాల నియోజకవర్గంలో గెలిచినప్పుడు వ్యాపారాలకు ఇచ్చిన విలువ గెలిపించిన ప్రజలకు ఇవ్వలేదని గుర్తు చేశారు. తన సొంత గ్రామం కూడా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందన్నారు. రాజకీయంగా దిగజారిన కొమ్మూరి ప్రతాపరెడ్డి భవిష్యత్తులో ఏ ఎన్నికలకు కూడా పనికిరాడన్నారు. ఇట్లాంటి వ్యక్తులు రాజకీయాల నుండి విరమించుకొని వ్యాపారాలు చేసుకోవాలని, ప్రజాసేవకు పనికిరారని అన్నారు. ఈ ప్రాంతంలో ప్రజా ఉద్యమాలు సీపీఎం మాత్రమే నిర్వహిస్తుందని, సీపీఎం పోరాటాలకు ప్రజలు అండదండలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు అత్తిని శారద, దాసరి ప్రశాంత్, మండల నాయకులు తేలు ఇస్తారి, తడూరి మల్లేశం ,సార్ల యాదయ్య ఆరుట్ల రవీందర్ శ్రవణచారి,భరత్, పవన్ మహేష్,రాజు తదితరులు పాల్గొన్నారు

భీమాక్ సైబర్ కాలనీ డైరెక్టర్లుగా 9 మంది



నవతెలంగాణ రామచంద్రాపురం

తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్ నగర్ లో గల భీమాక్ సైబర్ కాలనీ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఎన్నికలు ఆదివారం జరిగాయి. జిల్లా ఎన్నికల అధికారుల సమక్షంలో నిర్వహించిన ఈ ఎన్నికల్లో మొత్తం 34 మంది ఎన్నికల బరిలో నిలిచారు. 1,251 ఓటర్లు ఉన్న ఈ కాలనీలో 791 మంది వాలిడ్ ఓట్లు వేశారు. 13 మంది వేసిన ఓట్లు చెల్లనివిగా నమోదయ్యాయి. గత పది రోజులుగా కాలనీలో జరుగుతున్న ఎన్నికల కోలాహలం ఆదివారం సాయంత్రం వరకు కొనసాగింది. అభ్యర్థులు ఎవరికి వారు ప్రయత్నం చేశారు. రసవత్తంగా జరిగిన సొసైటీ ఎన్నికల్లో శివనారాయణ 508, వాసుదేవరావు 462, సంజీవ ప్రసాద్ 456, ప్రభాకర్ రెడ్డి 321, ఏడుకొండలు 295, మాధవరావు 279, గోవర్ధన్ 261, రవీందర్ 259, సునీల్ 254 ఓట్లు సంపాదించి గెలుపొందారు. డైరెక్టర్లుగా గెలిచిన 9 మంది కార్యవర్గాన్ని ఎన్నుకుంటారు. నూతనంగా ఎన్నికైన డైరెక్టర్లు కాలనీ సంక్షేమం అభివృద్ధి కోసం కృషి చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. తమకు ఓట్లు వేసి గెలిపించిన ఓటర్లు అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

జిల్లాలో పెరుగుతున్న కాలుష్యం అరికట్టాలి

- కాలుష్యకారక కంపెనీలపై చర్యలు తీసుకోవాలి
- మంజీర, చెరువులు, కుంటలు కాలుష్యం నుంచి కాపాడాలి
- సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు

నవతెలంగాణ-సంగారెడ్డి



'జిల్లాలో పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టాలి. కాలుష్యకారక కంపెనీలపై చర్యలు తీసుకోవాలి. మంజీర, చెరువులు, కుంటలు కాలుష్యం నుంచి కాపాడాలి' అని సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు అన్నారు. సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో డీఆర్ఓ నగేష్‌కు సీపీఎం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా కాలుష్యకారక కంపెనీలపై తక్షణమే చర్యలు తీసుకొని కాలుష్యం అరికట్టాలని డిమాండ్ చేశారు. జిన్నారం, పటాన్చెరు, కొండాపూర్, హత్నూర మండలాల్లోని కంపెనీల కాలుష్యం వలన చెరువులు, కుంటలు, భూగర్భ జలాలు పూర్తిగా కలుషితమై పోతున్నాయన్నారు. రైతులు సాగు చేసిన పంటలు దెబ్బతింటున్నాయన్నారు. ప్రజలు అనారోగ్యాలబారిన పడుతున్నారన్నారు. రోజురోజుకు పెరుగుతున్న వాయు కాలుష్యం అరికట్టాలన్నారు. లగ్దారం ప్రాంతంలోని కంకర్ల క్రషర్ల వాయు కాలుష్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని ఆరోపించారు. జిన్నారం మండలం గడ్డపోతారం అయ్యమ్మ చెరువు పైన ఉన్న కెమికల్ కంపెనీల యొక్క కాలుష్యం వలన అయ్యమ్మ చెరువు పూర్తిగా కలుషితమై పోయిందన్నారు. చెరువులో జీవరాసులు, చేపలు చనిపోతున్నాయన్నారు. నీటి రంగు పూర్తిగా మారిపోయిందన్నారు. కాజిపల్లి, సుల్తాన్‌పూర్ చెరువులు పూర్తిగా కలుషితమై పోయాయని తెలిపారు. పాశమైలారం కంపెనీల కలుష్యం వలన రుద్రారం, ఇస్నాపూర్ చెరువులు పూర్తిగా కలుషితమై పోయినట్లు తెలిపారు. కలుషిత జలాలు నక్కవాగు ద్వారా మంజీరాలో చేరుతున్నాయన్నారు. వివిధ మండలాల్లోని కంపెనీల వ్యర్థాల వలన మంజీర నది, చెరువులు, కుంటలు, బావులు కలుషితమై పోతున్నాయని తెలిపారు. ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరారు. అన్ని కంపెనీలో ఈటీపీ ప్లాంట్ ఏర్పాటు చేయాలన్నారు. పర్యవేక్షణ చేయని పీసీబీ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నర్సింలు, నాయకులు కృష్ణ, రాజయ్య, బాబూరావు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన బీఆర్‌ఎస్వీ నాయకులు అఖిల్



నవతెలంగాణ-సంగారెడ్డి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే కేటీఆర్‌ను తెలంగాణభవన్‌లో బీఆర్ఎస్వీ సంగారెడ్డి జిల్లా నాయకులు అఖిల్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అయనకు పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ప్రజల పక్షాన పోరాటం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకుడు రఘు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన అందోల్ జెడ్పీటీసీ

నవతెలంగాణ-జోగిపేట

సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతిని అందోల్ జెడ్పీటీసీ కే.రమేష్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కారించాలి

నవతెలంగాణ-సంగారెడ్డి

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కారించాలని అదనపు కలెక్టర్ మాధురి.. అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌హాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుండి డీఆర్ఓ నగేష్‌తో కలిసి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆయా శాఖల అధికారులు తమ శాఖకు సంబంధించి వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని, తిరస్కరించిన వాటికి సవివరమైనవివరణ ఇవ్వాలని సూచించారు. ప్రజావాణిలో మొత్తం 72దరఖాస్తులు రాగా, అందులో (30) రెవెన్యూ శాఖకు సంబంధించినవి కాగా, ఇతర శాఖలకు సంబంధించి 42 దరఖాస్తులు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ నగేష్, ఏవో పరమేష్, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవితఖైదు

నవతెలంగాణ-సంగారెడ్డి

మహిళను హత్య చేసిన కేసులో ఓ నిందితుడికి జీవితఖైదు పడింది. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. నిందితుడు మంగళి కృష్ణయ్యకు కవిత అనే మహిళతో పరిచయం ఏర్పడి.. ఇద్దరు సహజీవనం చేసేవారు. అయితే కవితకు అంతకుముందే నుంచే విజయ్ అనే మరో వ్యక్తితో వివాహేతర సంబంధం ఉండడం కృష్ణయ్యకు తెలిసింది. ఈ నేపథ్యంలో తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో 12.03.2023 తారీఖున బీర్ బాటిల్‌తో ఇంటికొచ్చిన కృష్ణయ్య.. కవిత తలపై బలంగా కొట్టి హత్య చేశాడు. ఈ కేసులో పూర్వాపరాలను పరిశీలించిన న్యాయస్థానం ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్, సెషన్స్ జడ్జ్, న్యాయమూర్తి కె.ప్రభాకర్ రావు.. నిందితుడికి జీవితఖైదుతోపాటు రూ.500 జరిమానా విధించారు. జరిమానా చెల్లించడంలో విఫలమైతే, సెక్షన్ 302 ఐపీసీ కింద ఒక నెల సాధారణ జైలు శిక్ష, సెక్షన్ 201 ఐపీసీ కింద మూడేండ్ల కఠిన కారాగార శిక్ష విధించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్.. నిందితునికి శిక్షపడేలా కృషి చేసిన అధికారులు యన్. శ్రీధర్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సంగారెడ్డి టౌన్ ఎఫ్ఐఆర్ అండ్ ఇన్వెస్టిగేషన్ అధికారి, పి.పి. జె.శ్రీనివాస్ రెడ్డి, కోర్ట్ డ్యూటీ ఆఫీసర్ ప్రశాంత్ రెడ్డి, కానిస్టేబుల్, కోర్ట్ లైజనింగ్ ఆఫీసర్స్ భాస్కర్, వెంకటేశం ఏఎస్సై కె.సత్యనారాయణ ఎస్ఐలను అభినందించారు.

నేడు బొల్లారంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం పారిశ్రామికవాడలోని పరిశ్రమలకు, బొల్లారంలో గృహ అవసరాలకు నేడు(మంగళవారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్టు ఏఈ రామకృష్ణారెడ్డి తెలిపారు. 132/33 కేవి లైన్ మరమత్తుల కారణంగా నేటి ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు చెప్పారు. అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

స్వప్న ఆత్మహత్య బాధాకరం



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ మండలంలోని రంజోల్ సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కాలేజీలో ఇంటర్ మొదటి ఏడాది చదువుతున్న బేగరి స్వప్న(17) ఆత్మహత్య చాలా బాధాకరమని జిల్లా సోషల్ వెల్ఫేర్ చైర్ పర్సన్, న్యాల్కల్ జడ్పీటీసీ స్వప్న భాస్కర్ అన్నారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి ఆధ్యక్ష తన సోమవారం జరిగిన సంగారెడ్డి జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశంలో కలెక్టర్ వల్లూరి క్రాంతి దృష్టికి స్వప్న ఆత్మహత్య విషయాన్ని స్వప్నభాస్కర్ తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థిని మృతికి గల కారణాలను తెలుసుకుని, మృతురాలి కుటుంబానికి ప్రభుత్వం తరపున అన్నీ రకాలుగా ఆదుకో వాలని సభ ముఖంగా కోరారు. నిరుపేద కుటుంబానికి చెం దిన విద్యార్థిణులు చదువుకుంటున్న హాస్టల్లో ఈ విధమైన ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలన్నారు.

కుంటల్లో అక్రమంగా నిర్మించిన ఇండ్లు కూల్చివేత

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మున్సిపల్ పరిధిలోని కోమటికుంట, మీదికుంటల్లో కబ్జాలకు పాల్పడి అక్రమంగా నిర్మించిన ఇండ్లను రెవెన్యూ మున్సిపల్ అధికారులు సంయుక్తంగా కలిసి సోమవారం కూల్చివేశారు. అధికారులు మాట్లాడుతూ.. కుంటల్లో, ప్రభుత్వ స్థలాల్లో అక్ర మంగా ఇల్లు నిర్మించుకుంటే చర్యలు తప్పవని హెచ్చ రించారు. ఈ కార్యక్రమంలో జిన్నారం రెవెన్యూ ఇన్స్పెక్టర్ జయ ప్రకాష్, సర్వేయర్ వీరభద్రం, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం అందజేత



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మున్సిపల్ పరిధిలోని హార్టెక్స్ రబ్బర్ పరిశ్రమ కార్మికుడు, ఐఎన్టీయూసి సభ్యులు గోపాల్‌రామ్ సతీమణి సుమిత్రా దేవి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నది. ఈ విషయం తెలిసి.. పటాన్‌చెరు నియో జకవర్గ కాంగ్రెస్ సీనియర్ నేత, బొల్లారం మున్సిపల్ ఐఎన్టీ యూసీ అధ్యక్షులు, మున్సిపల్ వైస్ చైర్మెన్ అంతిరెడ్డిగారి అనిల్ కుమార్‌రెడ్డి తనవం తుగా బాధిత కుటుంబానికి రూ.5000 ఆర్థిక సాయాన్ని అందజే శారు. అధైర్యపడొద్దని, కాంగ్రెస్ పార్టీ, తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరో సానిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు తూపల్లి రాజశేఖర్ రెడ్డి, ఐఎన్టీయూసి నాయకులు బెహరన్ యాదవ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-జిన్నారం

ఉపాధి హామీ చట్టాన్ని గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వావిలాల ఉపసర్పంచ్ నవనీతరెడ్డి అన్నారు. వావిలాల పంచాయతీ కార్యాలయంలో సెక్రటరీ అనుపమ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటైన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం సమీక్షా సమావేశంలో జాబ్‌కార్డు హెూ ల్డర్లను ఉద్దేశించి వారు మాట్లాడారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పూర్తి స్థాయిలో వినియోగిం చుకోవాలని కోరారు. కాగా తాము గతంలో పనిచే సిన కాలా నికి కూలి పనుల కింద డబ్బులు రాలేదంటూ కృష్ణ బృందం సమావేశం దృష్టికి తీసుకువచ్చింది. ఈ కార్యక్రమంలో వావిలాల గ్రామస్తులు గ్రామపంచాయతీ కారోబార్ బిక్షపతి, జాతీయ ఉపాధి హామీ చట్టం బృందం పాల్గొన్నారు.

విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి

నవతెలంగాణ-కోహిర్

విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శ్యామ్ అన్నారు. కోహిర్ మండల పరిధిలోని దిగ్వాల్ జిల్లా పరిషత్ పాఠశాలలో జిల్లా కార్యదర్శి అహెమ్మద్ హసీబుద్దిన్ వికార్ అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర కొత్త ప్రభుత్వం విద్యారంగ మరియు ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం చొరవ తీసుకోవాలన్నారు. సీపీఎస్ రద్దు చేయాలని పెండింగ్ డీఏలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం టీఎస్‌యూటీఎఫ్ కోహిర్ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మొహమ్మద్ బద్రు ద్దిన్, ప్రధాన కార్యదర్శి టీ.వెంకటేశ్వర రాజు, ఉపాధ్యక్షులుగా పి.ప్రసన్న, సయ్యద్ ఝాంగీర్, కోశాధికారిగా టీ.జనార్ధన్, మండల కార్యదర్శులుగా రాము, రజియడ్డిన్, నందిని, పూజిత, పుష్పమ్మ ఎన్నికయ్యారు. ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా బలరాం, సభ్యులుగా హామెద్ బిన్‌సయీద్, శంషాద్ బెగం, మీనాక్షి ముకుంద్ శిల్పి జిల్లా కార్యదర్శులను ఎన్నుకున్నారు.

మనస్తాపంతో ఫినాయిల్ తాగి వృద్ధురాలి ఆత్మహత్య

నవతెలంగాణ-వట్‌పల్లి

బీపీ, షుగర్ వ్యాధులతో బాధపడుతున్న ఓ వృద్ధురాలు మనస్తాపం చెంది ఫినాయిల్ తాగి ఆత్మహత్య చేసుకున్నది. ఈ ఘటన వటపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఖాదిరాబాద్ లో జరిగింది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కురుమ మల్లమ్మ(60) గత కొంత కాలంగా బీపీ, షుగర్ వ్యాధులతో బాధపడుతున్నది. ఆమె భర్త కొన్నేండ్ల క్రితమే మృతి చెందాడు. ఓ పక్క వ్యాధులు, మరోపక్క భర్త తోడు లేదనే బాధతో.. తీవ్ర మనస్తాపం చెంది సోమవారం ఉదయం ఫినాయిల్ తాగింది. ఆమె కొడుకు సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతు రాలి కుమారుడి ఫిర్యాదుతో కేసునమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్టు ఏఎస్ఐ తెలిపారు.

తప్పిపోయిన బాలుడు.. 90 నిమిషాల్లో తల్లిదండ్రుల చెంతకు

పోలీసులు, స్థానిక యువత బృందాలుగా ఏర్పడి బాలుడి గుర్తింపు.. అభినందించిన ఎస్పీ రూపేష్



నవతెలంగాణ-సంగారెడ్డి

ఆరేండ్ల వయస్సున్న ఓ బాలుడు తప్పిపోగా.. పోలీసులు, స్థానిక యువత బృందాలుగా మారి కేవలం 90 నిమిషాల్లోనే బాలుడిని గుర్తించి తల్లిదండ్రులకు అప్పజెప్పారు. ఈ ఘటన సంగారెడ్డి పట్టణంలో సోమవారం జరిగింది. కాగా చాకచక్యంగా వ్యహరించి బాలడుని గుర్తించిన పోలీసు సిబ్బంది, యువతను జిల్లా ఎస్పీ రూపేష్ అభినందించారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే..

తూర్పాటి లక్ష్మి, కీర్తిశేషులు రాజు దంపతుల ఆరేండ్ల కుమారుడు ధనుష్‌సంగారెడ్డిలోని విద్యానగర్‌లో ఎల్‌కేజీ చదువుతున్నాడు. అయితే ఆదివారం మధ్యాహ్నం సుమారు 3 గంటల ప్రాంతంలో స్నేహితులతో కలిసి ఆడుకోవడానికి ధనుష్ బయటికి వెళ్లాడు. కాసేపు అయ్యాక తల్లి బాలుడి కోసం వెళ్లగా కనిపించలేదు. దాంతో చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో.. సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించింది. ఫిర్యాదు అందుకున్న ఎస్ఐ రాజేష్ నాయక్.. సీఐ వి.సుధీర్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. దాంతో హుటాహుటనా సంగారెడ్డి రూరల్ సర్కిల్ అధ్వర్యంలో ఎస్ఐ, సిబ్బంది విద్యానగర్ యువత సాయంతో కలిసి 6 బృందాలుగా విడిపోయి తనిఖీలు చేప ట్టారు. సుమారు 90 నిమిషాల్లోనే బాలుడిని న్యూ బస్ స్టాండ్ ఏరియాలో గుర్తించి తలి లక్ష్మి చెంతకు చేర్చారు. బాలుడిని ట్రేస్ చేయడంలో కీలక పాత్ర పోషించిన సంగారెడ్డి రూరల్ సిబ్బంది, విద్యానగర్ యువత సాయి వికాస్, గురు ప్రసాద్, కార్తీ రెడ్డి, కాలనీవాసులను ఎస్పీ అభినం దించారు. ప్రజల ందరూ ఈ విధంగా పోలీసులకు సహకరించి, నేర రహిత సమాజంకోసం తమవంతు సహకారం అందించాలన్నారు.

రహదారి విస్తరణతో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి
- సంబంధితో అధికారులతో కలిసి పనుల పరిశీలన



నవతెలంగాణ-పటాన్‌చెరు

జాతీయ రహదారి విస్తరణతో పారిశ్రామిక వాడలో ట్రాఫిక్ సమస్యకు పూర్తిస్థాయిలో పరిష్కారం దొరుకుతుందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. మదీనాగూడ నుంచి లింగంపల్లి, పటాన్‌చెరు మీదుగా సంగారెడ్డి వరకు రూ.1200 కోట్ల అంచనా వ్యయంతో త్వరలోనే జాతీయ రహదారి విస్తరణా పనులను చేపట్టను న్నారు. ఈ నేపథ్యంలో పటాన్‌చెరు డివిజన్, ముత్తంగి గ్రామాల్లో చేపట్టనున్న విస్తరణా పనులపై సంభందిత అధికారులతో కలిసి ఎమ్మెల్యే సోమవారం పరిశీలించారు. ప్రధానంగా పటాన్‌చెరు పట్టణంల ఎంతవరకు విస్తరణ జరుగుతోందో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముత్తంగి గ్రామ పరిధిలో తప్పని సరిగా యూటర్న్ ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజా ప్రతినిధులు కోరారు. రహదారి విస్తరణ పూర్తయితే ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యం అందుబాటులోకి రావడంతో పాటు ట్రాఫిక్ సమస్య తీరుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ రహదారుల సంస్థ ఈఈ ధర్మారెడ్డి, పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, ముత్తంగి సర్పంచ్ ఉపేందర్, ఆత్మ కమిటీ చైర్మెన్ కుమార్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆత్మహత్యలపై న్యాయ విచారణ జరిపించాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

విద్యార్థుల వరుస ఆత్మహత్య ఘటనలపై న్యాయ విచారణ జరిపించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు ఎం.సురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ మాధురికి సోమవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం సురేష్ మాట్లాడుతూ.. శ్రీ చైతన్య, నారాయణ, విద్యసంస్థల్లోనే కాకుండా.. మొన్న గీతం యూనివర్సిటీలో ఆరో అంతస్తుపై నుంచి దూకి ఓ విద్యార్థిని.. నిన్న జహీరాబాద్ మండలంలోని రంజోల్ సాంఘిక సంక్షేమ గురుకుల కాలేజీలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థిణి క్లాస్ రూమ్‌లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నద న్నారు. వెంటనే ఈ ఘటనలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.సంక్షేమ గురుకులాల్లో విద్యార్థుల మరణాలకు గల కారణాలపై సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. గురుకులాల్లో చదు వుతున్న విద్యార్థులంతా పేద విద్యార్థులేనని.. వారి పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్యం తగదన్నారు. విద్యార్థులకు అవగాహనా సదస్సులు ఏర్పాటు చేసి సైకాలజిస్టులతో కౌన్సెలింగ్ ఇచ్చి.. వారి ప్రాణాలను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ డివిజన్ నాయకులు శివ, సుద్దేశ్వర, సమీ, అర్జున్, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం



నవతెలంగాణ-జహీరాబాద్

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు గడ్డం జనార్దన్ అన్నారు. జహీరాబాద్ పట్టణంలోని బాగారెడ్డి క్రీడా మైదానంలో ఖిజర్ యపై గోల్డ్‌కప్ టోర్నీలో భాగంగా సోమవారం రెండు మ్యాచులు రసవత్తరంగా సాగాయి. మొదటి మ్యాచ్‌లో ముఖ్య అతిథి జెబి రెస్టారెంట్ అధినేత ప్రవీణ్ టాస్ వేసి రెండో రోజు ఆటలను ప్రారంభించారు. మొదటి పోటీలో భాగంగా ఆల్పాతే మచిరెడ్డిపల్లి సీసీ మరియు సిటీ కోచింగ్ క్యాంప్ హైదరాబాద్ జట్ల మధ్య జరిగిన పోటీలో.. అల్పాతే సీసీ 9 వికెట్ల నష్టానికి 170 పరుగులు చేసింది. 171 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సీసీప హైదరాబాద్ 18.4 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 171 పరుగులు చేసి విజయం సాధించింది. అల్ రౌండర్ వాఫీ కచ్చికి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును ముఖ్య అతిథులు రాములు నేత, అబ్దుల్లా, జహంగీర్ ఖురేషి, యూనుస్ చేతుల మీదుగా అందజేశారు. రెండో మ్యాచులో టాస్ గెలిచిన టీహెచ్ఆర్ సిద్దిపేట్ ఫీల్డింగ్ ఎంచుకోగా.. ధారసింగ్ బ్యాటింగ్ చేసి 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 193 పరుగులు చేసింది. 194 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన టీహెచ్ఆర్ సిసి.. 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 158 పరుగులే చేయడంతో 35 పరుగులతో ఓటమి పాలైంది. అల్ రౌండర్‌గా రాణించిన హితేష్ యాదవ్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును ముఖ్య అతిథి నియోజకవర్గ పద్మశాలి సంఘం, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గడ్డం జనార్దన్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో టోర్నీ అధికార ప్రతినిధి రాములు నేత, మాజీ కౌన్సిలర్లు అబ్దుల్లా, మొహమ్మద్ యూనిస్, జహంగీర్ ఖురేషి, జునేగావ్ గ్రామ ఎంపీటీసీ విజేందర్ రెడ్డి, సహకార బ్యాంక్ మాజీ చైర్మెన్ బస్వరాజ్ పాటిల్, ముజాహిద్, అయ్యూబ్ తెలంగాణ వికలాంగ వేదిక అధ్యక్షుడు రాయికోటి నర్సింలు, ప్రముఖ వ్యాఖ్యాత అబ్దుల్లా సిద్దిఖీ, గడ్డం నాందేవ్ ట్రెజరీ పద్మశాలి సంఘం, విజయ్ రాథోడ్, మాక్సుద్‌అలీ, మహమ్మద్ అలీ, అదంయపై, అబుద్ యపై, అజ్మత్, పాషా, శెట్టి వెంకట్ ముదిరాజ్ పాల్గొన్నారు.

వ్యాపారానికి సింగూరు కాలువ నీరు

తమ పొలాలకు నీరందడం లేదంటూ తహసీల్దార్‌కు రైతుల ఫిర్యాదు..



నవతెలంగాణ-పుల్కల్

సింగూరు ఎడమ కాలువ ద్వారా రైతులకు రెండు పంటలకు నీటిని విడుదల చేస్తారు. అయితే ఆ నీటిని పుల్కల్ మండల పరిధిలోని ఇసోజీపేట గ్రామంలో ఉన్న అన్న పూర్ణ రైస్‌మిల్‌కు వాడుకోవడమే.. వారి సొంత పొలానికి మళ్లీస్తున్నారని.. దాంతో తమ పొలాలకు నీరందడం లేదం టూ పలువురు రైతులు తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు సోమ వారం వినతిపత్రం అంజదేశారు. ఈ సందర్భంగా తహసీ ల్దార్ మాట్లాడుతూ.. పంట పొలాల సాగు కోసమే సింగూ రు నీటిని వదులుతున్నామని.. ఆ నీటిని వ్యాపా రానికి వాడు కోవద్దన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. వెంటనే దీనిపై సమగ్ర విచారణ జరిపి రైతులకు తగిన న్యాయం జరిగే విధంగా చూడడమే కాకుండా ఆ నీటిని స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకుంటున్న రైస్‌మిల్ యజమానిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ఇకముందు ఎక్కడ కూడా సింగూరు ఎడమ కాలువ ద్వారా వచ్చే నీటిని వృథా చేసినట్లు తెలిస్తే వారిపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. రబీ సీజన్‌లో నాట్లు వేసే సమయం దగ్గర పడడంతో ఇప్పటికే రైతులు దు క్కులు దున్ని నారుమళ్లు సిద్ధం చేసుకున్నారన్నారు.. కాబట్టి త్వరలోనే సింగూరు ఎడమ కాలువ ద్వారా సుమారు 40,000 ఎకరాలకు సాగునీటిని విడుదల చేసేందుకు పై అధికారులకు నివేదికలు పంపించడం జరిగిందన్నారు. కావు న ఏ ఒక్క రైతు నిరాశ చెందకుండా.. ఈ నీటిని సద్విని యో గం చేసుకోవాలన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో టీసీ యువజన సంఘం మండలాధ్యక్షులు రవీందర్, రైతులు విజయ్, జయప్ప, రాములు, రవికుమార్ పాల్గొన్నారు.

సృజనాత్మకత వెలికి తీయడానికే వైజ్ఞానిక ప్రదర్శనలు



నవతెలంగాణ-సంగారెడ్డి

విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకత, నైపుణ్యత వెలికి తీయడానికి వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. సోమవారం పట్టణంలోని శాంతినగర్ లో గల సెయింట్ ఆంథోనీ ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై.. ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులను భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడానికి వైజ్ఞానిక ప్రదర్శనలు ఉపయుక్తమవుతా యన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందిం చాలనే ఉద్దేశంతో జిల్లాస్థాయిలో వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. రోజూ పుస్తకాలు చదవడమే కాకుండా, సబ్జెక్టుపై గ్రిప్ ఉండాలని విద్యార్థులకు సూచిం చారు. ఆసక్తితో ఆలోచిస్తే సబ్జెక్ట్ నాలెడ్జ్ పెరుగుతుందని, రాబోయే రోజుల్లో కొత్త కొత్త ఇన్నోవేషన్ రూపకల్పన జరగాలని ఆశించారు. సమస్యను విశ్లేషించే విధంగా చదివి ఆలోచించి కొత్త ఆవిష్క రణలకు రూపకల్పన చేయాలని హితువు పలికారు. ఈ సందర్భంగా ఆమె తన చిన్ననాటి రోజులలో సైన్స్ ఫెయిర్ లో చేసిన ఎగ్జిబిట్స్ గురించి గుర్తు చేసుకున్నారు. ఈ వైజ్ఞానిక ప్రదర్శనకు సుమారు 800 నుండి 900 వరకు ఎగ్జిబిట్స్ వచ్చే అవకాశం ఉందని తెలిపారు.సైన్స్ ఎగ్జిబిషన్లో పాల్గొంటున్న విద్యార్థులందరికీ అభినందనలు తెలిపారు. అనంతరం ఎగ్జిబిట్స్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. విద్యార్థులను ఆయా ఎగ్జిబిట్స్ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ంతకుముందు విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, స్కూల్ కరస్పాండెంట్ సల్ మోహన్ రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి విజయకుమార్, డిఇసిబి సెక్రెటరీ లింబాద్రి, ఎంఈఓ లు, నిర్వాహక కమిటీలు, మీడియా కోఆర్డినేటర్ జాకీర్ హుస్సేన్, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి



నవతెలంగాణ-రామచంద్రాపురం

నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. భారతినగర్ డివిజన్ పరిధిలోని వార్డు కార్యాలయంలో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ మరియు రిటైర్డ్ పర్సన్స్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటుచేసిన నూతన సంవత్సర క్యాలెండర్ మరియు డైరీ ఆవిష్కరణ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తమ సర్వీసు కాలంలో ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రజలకు మెరుగైన సేవలు అందించారన్నారు. నియోజకవర్గ అభివృద్ధిలోనూ వారి సూచనలు కీలకమని తెలిపారు. సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామనాన్నరు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సింధు ఆదర్శరెడ్డి, పుష్ప నగేష్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, సర్కిల్ అధ్య క్షులు పరమేష్ యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాటి సత్యనారాయణ, ఐలేష్ యాదవ్, ప్రమోద్‌గౌడ్,పెన్షనర్ అసోసియేషన్ సభ్యులు వైకుంఠ రావు,రామ రావు, వెంక ట్ రెడ్డి, దేవేంద్ర చారీ,రాధకృష్ణ, నారద,ఎల్ఐజి కాలనీ ప్రెసిడెంట్ యాదగిరిరెడ్డి, మాజీ అధ్యక్షులు నారాయణరెడ్డిపాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా పరిపాలన



నవతెలంగాణ-అమీన్‌పూర్

అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని ప్రతి కాలనీలకు అభివృద్ధే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తూ, నిధులు కేటాయి స్తున్నామని మున్సిపల్ చైర్మెన్ తుమ్మల పాండు రంగారెడ్డి తెలిపారు. మున్సిపల్ పరిధిలోని ఐదో వార్డు ఆర్టీసీ కాలనీలో రూ.70 లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్లు, రూ.40 లక్షలతో నిర్మించనున్న యూజీడి నిర్మాణ పనులకు స్థానిక కౌన్సిలర్ మహదేవరెడ్డితో కలిసి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పాటు అవుతున్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, కోఆప్షన్ సభ్యులు తల్లారి రాములు, వీ ఫర్ యూత్ ప్రెసిడెంట్ వినోద్‌కుమార్,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పోసానిపేట నుంచి ఏడుపాయలకు పాదయాత్ర



నవతెలంగాణ-జోగిపేట

అందోల్ మండలం పోసానిపేట గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు, న్యాయవాది మధుసూదన్ రెడ్డి సారథ్యంలో స్థానిక నాయకులు.. పోసానిపేట నుంచి ఏడుపాయల దుర్గ భవాని దేవస్థానానికి పాదయాత్ర చేపట్టారు. అందోల్ కాంగ్రెస్ అభ్యర్థి దామోదర్ రాజనర్సింహ ఎమ్మెల్యేగా గెలిస్తే ఏడుపాయల ఆలయానికి పాదయాత్రగా వస్తామని ఎన్నికల ముందు మొక్కుకున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఆ మొక్కును చెల్లించుకున్నట్టు న్యాయవాది మధుసూధన్‌రెడ్డి తెలిపారు. సుమారుగా 100 మంది కార్యకర్తలు, నాయకులు పాద యాత్రలో పాల్గొని మంత్రి దామోదర్ నాయకత్వం వర్ధిల్లాలి, కాంగ్రెస్ పార్టీ జిందాబాద్ అంటూ నినాదాలు చేసుకు ం టూ వెళ్లారు. సీనియర్ నాయకుడు అనీఫొద్దిన్, నాయకులు శివచందర్, వెంకటేశం, గోపాల్, జనార్దన్, ఎల్లయ్య,రఘుపతితో పాటు పలు వురు పాద యాత్రగా వెళ్లిన వారిలో ఉన్నారు.

సామాన్యుడి గొంతుక 'నవతెలంగాణ'



ఉమ్మడి మండలాల పీఏసీఎస్ చైర్మన్ మెట్టు బాలక్రిష్టారెడ్డి

నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

కార్మిక కర్షక సామాన్యుడి తరపున నిలుస్తూ వారి సంక్షేమం కోసం ఉద్యమిస్తూ వారి గొంతుకగా నిలుస్తున్న ఏకైక పత్రిక నవతెలంగాణ అని ఉమ్మడి మండలాల పీఏసీఎస్ చైర్మన్ మెట్టు బాలక్రిష్టారెడ్డి పేర్కొన్నారు. సోమవారం తూప్రాన్ పీఏసీఎస్ సొసైటీ కార్యాలయంలో నవతెలంగాణ-2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల పక్షాన నిలుస్తూ వారి కోసం పోరాడే పత్రిక అన్నారు. ప్రతినిత్యం ప్రజలకు ఉపయోగపడే వార్తలను అందిస్తూ వారిని ఆలోచింప చేసే విధంగా వార్తలను అందిస్తున్న పత్రిక నవతెలంగాణ అన్నారు. సమాజంలో జరిగే అన్యాయాలు అక్రమాలపై ఎప్పటికప్పుడు బయటకు తీయడంలో నవతెలంగాణ ముందుంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు కావేరిగారి భగవాన్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్లు యాదాగౌడ్, చంద్రశేఖర్‌రెడ్డి, సత్యనారాయణ, సొసైటీ సీఈవో దినేష్, సిబ్బంది దశరథ తదితరులు పాల్గొన్నారు.

20 ఎకరాలకు పైగా అడవిభూమి కబ్జా

- డీఎఫ్ఓ ముందే రేంజ్ అధికారిని నిలదీసిన గ్రామస్తులు
- అడవి శాఖ అధికారి అంబర్ సింగ్ రూ. 50 లక్షల ఒప్పందం
- గ్రామస్తుల ఆరోపణ

నవతెలంగాణ-కౌడిపల్లి

రూ.40 కోట్లు విలువ చేసే అటవీ భూమి అక్రమంగా కబ్జా చేస్తున్న సంఘటన కౌడిపల్లి మండలం నాగసాన్ పల్లి శివారు ప్రాంతంలో ఆలస్యంగా సోమవారం వెలుగు చూసింది. కబ్జా చేస్తున్న విషయం అటవీశాఖ అధికారులకు తెలిసినా తెలియదన్నట్లుగా వ్యవహరించడంతో జిల్లా అటవీశాఖ అధికారికి గ్రామస్తులు సోమవారం ఫిర్యాదు చేశారు. జిల్లా అటవీ శాఖ అధికారి విచారణ చేపట్టారు. గత వారం రోజులుగా అటవీ పరిధిలోని చెట్లను నరికి వేస్తూ కంచె వేస్తున్న సంఘటన గ్రామస్తులు, విచారణకు వచ్చిన జిల్లా అధికారి ముందే కనిపించడంతో నివ్వెర పోయారు. గ్రామ సర్పంచ్ అల్మాయిపేట ఎల్లం, ఉపసర్పంచ్ పాం నరహరితో పాటు గ్రామస్తులు రాములు, సుధాకర్, శ్రీను, లక్ష్మయ్య, సత్తయ్య, రాజలింగంతో పాటు మరో పదిమంది గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామ శివారులోని సర్వేనెంబర్ 93లో సుమారు ప్రభుత్వ భూమి 144 ఎకరాలకు పైగా భూమి ఉండగా దీనిలో 30 మంది రైతులకు 2008-09 లో అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ చేతుల మీదుగా 25 ఎకరాలకు పైగా పట్టాపాస్ పుస్తకాలు ఉండగా అటవీశాఖ అధికారులు రైతులను రానివ్వకుండా పనిచేస్తున్నారు. ఇదే సర్వే నెంబర్లు కర్ణాటక రాష్ట్రంలో పోలీసు శాఖలో పనిచేస్తున్న ప్రధాన అధికారి తన





బంధువుల పేరున సర్వేనెంబర్ 93లో తమకు అనుకుని ఉన్న పట్టా భూమిలో రికార్డు తక్కువగా ఉందని పక్కనే ఉన్న అటవీ భూమిలోని చెట్లను నరికి 20 ఎకరాల ప్రభుత్వ అటవీ భూమిలోని కంచెను తొలగించి కబ్జా చేసే ప్రయత్నం చేయగా విషయం తెలుసుకున్న గ్రామస్తులు జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అటవీ భూమి కబ్జా చేస్తూ చెట్లను నరికివేసి కలపను గోతి తీసి అందులో వేసి మట్టి కప్పేసి కబ్జా చేయటమేంటని గ్రామస్తులు గొడవకు దిగారు.

అమ్ముడు పోయే అధికారుల అలసత్వంతోనే కబ్జా

93 సర్వే నెంబర్ లోని 20 ఎకరాల అటవీ శాఖ భూమిని అధికారుల చేతివాటంతోనే కోట్ల రూపాయల విలువగల భూమి కబ్జాకు గురవుతున్నా తమకు సంబంధం లేదన్నట్లుగా అటవీశాఖ అధికారులు వ్యవహరిస్తున్న తీరు గ్రామస్తులను విస్మయానికి గురిచేస్తుందని పేర్కొన్నారు. పేదలు కనీసం కంచె దాటితే కేసులు పెట్టే అటవీశాఖ అధికారులు కబ్జాదారులకు మద్దతు పలుకుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామానికి చెందిన పేద రైతులకు అప్పటి దేశ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ ఇచ్చిన పట్టాలను తమకు సంబంధం లేదని నర్సాపూర్ అటవీశాఖ అధికారి అంబర్ సింగ్ పేర్కొనడం గమనార్హం. విషయం తెలుసుకున్న జిల్లా అటవీశాఖ అధికారి రవిప్రసాద్ కబ్జా చేసిన అటవీ ప్రాంతం పరిశీలిస్తుండగా గ్రామస్తులతో అటవీశాఖ అధికారి అంబర్ సింగ్ కబ్జాదారులకు వత్తాసు పలుకుతూ పై అధికారికి తప్పు సమాచారం అందించే ప్రయత్నం చేస్తుండగా గ్రామస్తులు గొడవకు దిగారు. ఈ సందర్భంగా గత వారం రోజులుగా అటవీ పరిధిలోని చెట్లను నరికి వేస్తుంటే అటవీ పరిధిలోని ఫారెస్ట్ రేంజ్ అధికారి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. అనుమతులు లేకుండా చెట్లను నరికిన వారిపై అటవీ, వాల్టా చట్టం ప్రకారం బాధ్యులపై పూర్తిస్థాయి విచారణ చేసి చర్యలు తీసుకుని కేసులు పెడతామని పేర్కొన్నారు. ఆయన వెంట నర్సాపూర్ సెక్షన్ అధికారి కరీముద్దీన్‌తో పాటు అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రజావాణి

జిల్లా కలెక్టర్ రాజర్షి షా



నవతెలంగాణ-మెదక్

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి 82 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు సమర్పించిన దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూములకు సంబంధించి, ఉద్యోగం, ఉపాధి తదితర ఫిర్యాదులు ఎక్కువగా ఉన్నాయని వాటిని త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టరు వేంకటేశ్వర్లు, డిఆర్ఓ పద్మ శ్రీ, డిపిఓ సాయిబాబా, మైనింగ్, జియాలజీ సహాయ సంచాలకులు జయరాజ్, డిఎఫ్ఓ రవిప్రసాద్, డిఏఓ గోవింద్, డిఈఓ రాధాకిషన్, డిడబ్ల్యూఓ బ్రహ్మాజీ, పిడి మెప్మా ఇందిర, డిఐఈఓ సత్యనారాయణ, సంబంధిత అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన వ్యవసాయ అధికారి



నవతెలంగాణ-నిజాంపేట

మండలంలోని నస్కల్ గ్రామంలో ఏడిఏ వసంత సుగుణ రైతుల పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ వసంత మాట్లాడుతూ మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు ఉధృతి అధికంగా ఉన్నందున ఏమామక్టిన్ బెంజోయేట్ 80 గ్రా ఎకరంకు మందును పిచికారి చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ కావేరి, రైతులు బక్కొల్ల దేవరాజ్ పాల్గొనడం జరిగింది.

ప్రణాళికపై నాలుగు మండలాల ఐకెపి సిబ్బందికి శిక్షణ



నవతెలంగాణ-చేగుంట

చేగుంట మండలం ఐకెపి కార్యాలయంలో సోమవారం నాలుగు మండలాల ఐకెపి సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా యాంకర్ పర్సన్ వెంకటస్వామి మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రణాళికలను తయారు చేయడం జరుగుతుందన్నారు. గ్రామంలో ఎవరెవరికి రేషన్ కార్డు, ఉపాధి హామీ కార్డు పెన్షన్, గ్యాస్ సిలిండర్ కనెక్షన్, గ్రామ స్థాయిలో గ్రూపు సంఘాలు నెంబర్ల వారీగా గ్రామ సంఘం వారి ప్రణాళికలు తయారు చేసి ఎలా ఆన్లైన్లో నమోదు చేయాలనే దానిపై వారికి పూర్తి అవగాహన కల్పించారు. ప్రతి సంఘ సభ్యులు ఈ ప్రణాళికపై ప్రత్యేక దృష్టి పెట్టి, ప్రతి అంశంపై ఆన్లైన్లో నమోదుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం లక్ష్మి నరసమ్మ, సీసీలు రామస్వామి, స్వామి, అంజా నాయక్, శ్వేత, వివో లీడర్లు, సిబ్బంది, వివిధ మండలాల ఏపీఎంలు, తదితరులు పాల్గొన్నారు. శిక్షణలో వివోఏలు, సీసీలు, ఏపీఎంలు పాల్గొన్నారు.

భీమ్‌రావుపల్లిలో వికసిత్ భారత్



నవతెలంగాణ-నార్సింగి

మండల పరిధిలోని భీమ్‌రావుపల్లి గ్రామంలో సోమవారం బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యపాల్ రెడ్డి ఆధ్వర్యంలో వికసిత్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు పథకాల గూర్చి అవగాహన కల్పించామని సత్యపాల్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అందరికీ క్యాలెండర్‌ను అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యపాల్ రెడ్డి, దుబ్బాక అసెంబ్లీ నియోజకవర్గం కో కన్వీనర్ గోవింద్, మండల పార్టీ అధ్యక్షుడు బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ఈచాలాన్లపై భారీ డిస్కౌంట్



నవతెలంగాణ-సంగారెడ్డి

పెండింగ్ ఈచాలాన్లపై భారీ డిస్కౌంట్‌ను ఈ నెల 10లోగా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ ఈచాలాన్లపై భారీగా డిస్కౌంట్ ప్రకటించిందని గుర్తు చేశారు. బైక్, ఆటోలపై 80 శాతం. కారు, లారీలపై 60 శాతం, ఆర్టీసీ బస్సులపై 90 శాతం డిస్కౌంట్ ఉంటుందని తెలియజేశారు

సంక్షేమ హాస్టళ్ల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



నవ తెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

సిద్దిపేట జిల్లాలోని అన్ని హాస్టల్స్, పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని దళిత బహుజన ఫ్రంట్ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు భీమ్ శేఖర్ కోరారు. 'దుబ్బాక మైనారిటీ రెసిడెన్షియల్ హాస్టల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టడం లేదు. కాస్మోటిక్ చార్జీలు విద్యార్థులకు అందకపోవడం లేదు. సమీకృత సంక్షేమ బాలుర వసతి గృహంలో మరుగుదొడ్లు ఉపయోగకరంగా లేవు. మూడు నెలలు గడుస్తున్న కాస్మోటిక్ చార్జెస్ అందడం లేదు. మెస్ బిల్స్ పెండింగ్లో ఉన్నాయి. కోహెడ మండలం శనిగారంలో ఉన్న బీసీ హాస్టల్‌లో నీటి సదుపాయం లేదు. పది మరుగుదొడ్లు నిర్మించి 8 సంవత్సరాలైనా ఉపయోగంలో లేవు. విద్యార్థులు కాలకృత్యాల కోసం చెట్లు గుట్టలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. వంట గది వర్షాలకు ఉరుస్తున్నది. పెచ్చులు ఊడుతున్నది. శనిగారంలో ఉన్న ఎస్సీ హాస్టల్‌లో మరుగుదొడ్లు గత 30 సంవత్సరాల క్రితం నిర్మించారు. ప్రస్తుతం పెచ్చులుడుతున్నాయి. బెజ్జంకి మండలంలో ఉన్న ఎస్సీ హాస్టల్లో మూడు నెలలుగా కాస్మోటిక్ చార్జెస్ అందడం లేదు. జిల్లాలో ఉన్న మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలి. వేతనాలు పెంచాలి. జిల్లాలో ఉన్న అన్ని హాస్టల్లో విద్యార్థుల సమస్యలు తీర్చాలి. శిథిలావస్థ ఉన్న హాస్టళ్లకు భవనాలు నిర్మించాలి' అని కోరుతూ సోమవారం ప్రజావాణిలో జిల్లా అడిషనల్ కలెక్టర్ గరీమా అగర్వాల్ కు వినతిపత్రం అందజేశారు. వెంటనే ఆమె స్పందించారు. విచారణ చేపట్టాలని జిల్లా మైనారిటీ అధికారి, డి బి సి డి ఓ సరోజన, డి ఎస్ సి డి ఓ కవితను ఆదేశించారు.

ఇంచార్జి మున్సిపల్ చైర్మన్‌గా నహీముద్దీన్





నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ మున్సిపల్ ఇంచార్జి చైర్మన్‌గా నహీముద్దీన్ సోమవారం నర్సాపూర్ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వెంకట్ గోపాల్‌తో పాటు కౌన్సిలర్ల సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్‌గా కొనసాగిన మురళి యాదవ్‌పై 9 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు అవిశ్వాస పెడుతూ తీర్మానం చేసి నోటీసును అదనపు జిల్లా కలెక్టర్ రమేష్‌కు అందజేసిన విషయం తెలిసిందే. అయితే మున్సిపల్ చైర్మన్ మురళి యాదవ్ స్వచ్ఛందంగా చైర్మన్ పదవికి రాజీనామా చేస్తూ రాజీనామా పత్రాన్ని మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ ద్వారా జిల్లా కలెక్టర్‌కు అందించారు. దీంతో జిల్లా కలెక్టర్ రాజర్షి షా మురళీధర్ యాదవ్ రాజీనామాను ఆమోదించి మున్సిపల్ వైస్ చైర్మన్‌గా ఉన్న నహీముద్దీన్‌ను ఇంచార్జి మున్సిపల్ చైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఇన్చార్జి మున్సిపల్ చైర్మన్‌గా నహిముద్దీన్ బాధ్యతలు స్వీకరించారు. నర్సాపూర్ ఇంచార్జ్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన నహీముద్దీన్‌ను మాజీ చైర్మన్ మురళీధర్ యాదవ్‌తో పాటు కౌన్సిలర్లు నాయకులు పలువురు అభినందించి శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్ గోపాల్, కౌన్సిలర్ అశోక్ గౌడ్, రామచందర్, సునీత బాల్ రెడ్డి, లలిత బిక్షపతి, లక్ష్మీ నాగేష్, సరిత ఆంజనేయులు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు భోగ చంద్రశేఖర్, నాయకులు సత్యం గౌడ్, తొంట వెంకటేష్, జ్ఞానేశ్వర్ గుప్తా, సూరారం నరసింహులు, రింగుల ప్రసాద్, మున్సిపల్ మేనేజర్ మధుసూదన్, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌కంట్యాక్స్‌పై డిడిఓలకు అవగాహణ



నవతెలంగాణ-మెదక్

ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాలు, జీతభత్యాలేతర ఆదాయపు పన్నుకు సంబంధించిన టిడిఎస్ ఇన్‌కం టాక్స్ పత్రాలు ఆన్లైన్‌లో ఎలా సమర్పించాలనే అంశంపై సోమవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ అవగాహన సదస్సుకు రాష్ట్ర ఇన్‌కం ట్యాక్స్ కార్యాలయ అధికారి మానస్ నిరంజన్ హాజరై జిల్లాలోని డిడిఓలకు, ప్రభుత్వ అకౌంటెంట్లకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెల ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాల నుంచి రికవరీ చేసిన ఇన్‌కం టాక్స్ టిడిఎస్ రిటర్న్ ఆన్లైన్ నమోదు అవుతుందో లేదో చూసుకొనే బాధ్యత డిడిఓలదేనన్నారు. ప్రతినెలా జీతాల నుంచి మినహాయించిన ఇన్కమ్ టాక్స్‌ను టిడిఎస్ రిటర్న్‌ను మొదటి క్వాటర్ జులై 31, 2వ క్వాటర్ అక్టోబర్ 31, 3వ క్వాటర్ జనవరి 31, 4వ క్వాటర్ 15వ మే, కొత్త ఆర్థిక సంవత్సరంలో టిడిఎస్ రిటర్న్ ఆన్లైన్ చేయాలని తెలిపారు. అలాకాకుండా మ్యానువల్‌గా రిటర్న్ పొందుపర్చితే ఉద్యోగికి నష్టం కలుగుతుందని తెలిపారు. క్వాటర్లీ టిడిఎస్ రిటర్న్ ఫారం 24 క్యూ, ఫారం 26క్యూ ఫారం 27క్యూ ఫారం 27ఈక్యూలపై డిడిఓలు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఖజానాధికారి చిన్న సాయిలు, జిల్లాలోని వివిధ కార్యాలయాల నుంచి వచ్చిన డిడిఓలు, అకౌంటెంట్‌లు పాల్గొన్నారు .

రైతులను ఆదుకున్న శ్రీధర్ గుప్తకు న్యాయం చేయాలి

గాంధీ విగ్రహం వద్ద కాగజ్ మద్దూర్ రైతుల శాంతి యుత నిరసన



నవతెలంగాణ-నర్సాపూర్

గత ప్రభుత్వ ఆదేశాలతో అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని తీసుకొని రైతులను ఆదుకున్న రైస్ మిల్ వ్యాపారి శ్రీధర్ గుప్తాకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం నర్సాపూర్ మండలం కాగజ్ మద్దూర్ గ్రామంలో రైతులు, గ్రామస్తులు కలిసి గ్రామంలోని గాంధీ విగ్రహం వద్ద శాంతియుతంగా నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హాయంలో అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని చెప్పడంతో రైస్‌మిల్ వ్యాపారి శ్రీధర్ గుప్తా నర్సాపూర్ నియోజకవర్గంలోని రైతుల నుంచి పెద్ద ఎత్తున తడసిన ధాన్యాన్ని తీసుకోవడం జరిగిందన్నారు. తడిసిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి ప్రభుత్వానికి అప్పజెప్పేందుకు నర్సాపూర్, కౌడిపల్లి మండలం తునికి, మక్త మాసానిపల్లిలలోని గోదాముల్లో బియ్యం భద్రపరిచారన్నారు. అట్టి బియ్యం నాణ్యతగా లేవని ప్రభుత్వం తీసుకోకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. నేటికీ మూడు గోదాముల్లో సుమారు 40 కోట్లకుపైగా విలువ ఉన్న బియ్యం ములుగుతున్నాయన్నారు. శ్రీధర్ గుప్తా నుంచి బియ్యం తీసుకోకుండా ఆయనను ఇబ్బందులు పెడుతూ ప్రభుత్వానికి పెద్ద మొత్తంలో బాకీ ఉన్నాడని అతని ఆస్తులు జప్తు చేయడం బాధాకరమన్నారు. న్యాయ విచారణ చేపట్టి రైతుల నుంచి తడిసిన ధాన్యాన్ని తీసుకుని రైతులను ఆదుకున్న శ్రీధర్ గుప్తాకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌తో పాటు ఇతర అధికారాలను వారు మొరపెట్టుకున్నారు ఈ నిరసన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శివకుమార్, మాజీ సర్పంచ్ శంకరయ్య, రైతులు మన్మథ రెడ్డి, మల్లేశం, కిష్టయ్య, గ్రామ రైతులు , గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అభయహస్తం దరఖాస్తులను త్వరితగతిన డాటా ఎంట్రీ చేయాలి

మెదక్ అదనపు కలెక్టర్ రమేష్



నవతెలంగాణ-కొల్చారం

ప్రజా పాలన అభయహస్తం దరఖాస్తులను త్వరితగతిన డాటా ఎంట్రీ పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రమేష్ సూచించారు. మండల కేంద్రమైన కొల్చారంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్లో దరఖాస్తుల కంప్యూటరీకరణను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈ నెల 17వ తేదీలోపు డాటా ఎంట్రీ పూర్తి చేయాలన్నారు. కొల్చారం మండల వ్యాప్తంగా ప్రజాపాలనలో రెండు టీంల ద్వారా 21 గ్రామ పంచాయతీలలో ఆరు గ్యారెంటీలకు సంబంధించి 12,550 అభయహస్తం దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఏ ఒక్క దరఖాస్తును విస్మరించకుండా పూర్తిగా డాటాను నమోదు చేయాలని ఎంపీడీవో, తహసీల్దార్‌లకు సూచించారు. కొల్చారం మండలంలో దరఖాస్తుల ఎంట్రీ సంతృప్తికరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గణేష్ రెడ్డి, తహసీల్దార్ మహ్మద్ గఫర్ మియా, డిప్యూటీ తహసీల్దార్ నాగవర్ధన్, గిర్దవర్ ప్రభాకర్, ఎంపీఓ లక్ష్మీ నరసింహులు, ఏపీఓ మహిపాల్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రాకేష్ గౌడ్, పంచాయితీ కార్యదర్శులు ఉన్నారు.

ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలను నహీమొద్దీన్





నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ మున్సిపల్ ఇన్చార్జి చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన నహిమొద్దీన్ సోమవారం ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డిని, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం సాయంత్రం హైదరాబాదులోని ఎమ్మెల్యే సునీత రెడ్డి నివాసానికి నహిమోద్దీన్ వెళ్లి ఎమ్మెల్యే సునీత రెడ్డిని కలిసి పుష్పగుచాలు అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా సునీత రెడ్డి నహిమొద్దీన్‌ను అభినందించి శాలువాతో సన్మానం చేశారు. అదేవిధంగా హైదరాబాదులోని మాజీ ఎమ్మెల్యే మదర్ రెడ్డి నివాసానికి వెళ్లి ఆయనను నహిమొద్దీన్ మర్యాదపూర్వక కలిశారు ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు అశోక్ గౌడ్, రామచందర్, బీఆర్ఎస్ నాయకులు సత్యం గౌడ్, పంబల్ల బిక్షపతి, కుమ్మరి నాగేష్, ఆంజనేయులు గౌడ్, సత్యం గౌడ్‌లు పాల్గొన్నారు.

మనోహరాబాద్ తహశీల్దార్‌గా చంద్రశేఖర్‌రెడ్డి



నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

మనోహరాబాద్ నూతన తహశీల్దార్‌గా అప్పిడి చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఇప్పటి వరకు మనోహరాబాద్ తహశీల్దార్‌గా బాధ్యతలు నిర్వహించిన శ్రీనివాస్‌రావ్ మెదక్ కలెక్టరేట్‌కు బదిలీపై వెళ్లడంతో చంద్రశేఖర్ రెడ్డి చిన్నశంకరంపేట నుంచి బదిలీపై మనోహరాబాద్‌కు వచ్చారు. నూతన తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం ఉపాధ్యక్షులు నత్తి మల్లేష్ ముదిరాజ్, పోతారం సర్పంచ్ బడికోలు మాదవరెడ్డి, జిల్లా ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు పంచమి రేణుకుమార్‌ల ఆధ్వర్యంలో నాయకులు తహశీల్దార్‌కు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ కౌశిక, ఉపసర్పంచ్‌లు వెంకటేష్ యాదవ్, మహెందర్‌గౌడ్, నాయకులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

టీపీయూఎస్ క్యాలండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో టీపీయూఎస్ క్యాలండర్‌ను సోమవారం తహసీల్దార్ సురేష్ కుమార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ జిల్లా అధ్యక్షులు యాదగిరి, నిజాంపేట మండల అధ్యక్షులు ఉమ్లా నాయక్, కార్యదర్శి రాజశేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యులు రవీందర్ రెడ్డి, మన్నె గోపాల్, పంచాయతీ అధికారి నర్సింలు, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన



నవతెలంగాణ-నార్సింగి

మండల పరిధిలోని భీమ్ రావుపల్లి వార్డ్ మెంబర్ బోయిని భూషణం ఆధ్వర్యంలో ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో 1988-89 పదవ తరగతి బ్యాచ్‌కు పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు మెంబర్ బోయినీ భూషణం మాట్లాడుతూ 34 సంవత్సరాల అనంతరం చిన్ననాటి స్నేహితులు మళ్ళీ ఒకే చోట కలవడం చాలా సంతోషాన్నిచ్చిందన్నారు. పదవ తరగతి పూర్తయ్యాక కొంతమంది ఉద్యోగాల్లో స్థిరపడగా, మరికొంతమంది వ్యాపార రంగంలో, ఇతర రంగాల్లో కొనసాగుతున్నారని పేర్కొన్నారు. ఏళ్ళు గడిచాక ఒకే చోట చేరడంతో ఆత్మీయ పలుకరింపులు, అలింగనాల నడుమ నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నామన్నారు. తమతో పాటు చదివిన తోటి మిత్రుడు తడుపునూరి రాజు తెలంగాణ రాష్ట్ర ఫార్మసి కౌన్సిల్ మెంబరుగా గెలుపొందడం జరిగిందని, ఆ దంపతులకు శాలువాలతో సన్మానించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పావని, వాణి మాధవి, సిద్ధిరాం రెడ్డి, కేశవరావు, వెంకటి, యాదగిరి, రాజు, ముత్యాలు, రాజు తదితరులు పాల్గొన్నారు.

డాటా ఎంట్రీని త్వరగా పూర్తి చేయాలి



నవ తెలంగాణ-టేక్మాల్

డాటా ఎంట్రీని త్వరగా పూర్తిచేసి వెబ్‌సైట్‌లో పొందుపరచాలని మెదక్ ఆర్‌డిఓ అంబదాస్ రాజేశ్వర్ అన్నారు. సోమవారం టేక్మాల్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ప్రజాపాలన దరఖాస్తుల ఆన్లైన్ ప్రక్రియను మెదక్ ఆర్డిఓ అంబాదాస్ రాజేశ్వర్ పరిశీలించారు. గత 28వ తేదీ నుంచి జనవరి 6 తేదీ వరకు ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తుల వివరాలను డాటా ఎంట్రీ ద్వారా కంప్యూటర్లలో నిక్షిప్తం చేస్తున్నారు. మొత్తం 20 మంది సిబ్బంది రోజుకు 60 దరఖాస్తుల చొప్పున ఎంట్రీ చేస్తున్నారని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన సమయంలోపు డాటా ఎంట్రీ పూర్తి చేస్తామని ఆర్డిఓ అంబాదాసు రాజేశ్వరరావు తెలిపారు. మెదక్ డివిజన్ పరిధిలో ఒక్క లక్ష 15 వేల పైన దరఖాస్తులు స్వీకరించామని, వాటిని డాటా ఎంట్రీ చేస్తున్నామని తెలిపారు ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ, ఎంపిడివో రియాజ్ దీన్, అధికారులు సిబ్బంది తదితరులు ఉన్నారు.

మాజీ మంత్రి హరీష్ రావును కలిసిన ఆలయ ధర్మకర్త



నవతెలంగాణ-చేగుంట

చేగుంట మండలం ఇబ్రహీంపూర్ గ్రామ శ్రీ వెంకటేశ్వర ఆలయ ధర్మకర్త, మెదక్ జిల్లా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గోల్కొండ కిషన్ రావు దేశ్‌ముక్ సోమవారం మాజీ మంత్రివర్యులు తన్నీరు హరీష్ రావును కలిశారు. హరీశ్‌రావు నివాసంలో ఆయనను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాసాయిపేట సర్పంచ్ మధుసూదన రెడ్డి ఆర్థిక శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీకి మంచి రోజులు వస్తాయని హరీశ్‌రావు దిశా, నిర్దేశం చేశారని కిషన్‌రావు దేశ్‌ముక్ తెలిపారు.

ఆడపడుచులకు సంక్రాంతి ముగ్గుల పోటీలు

విజేతలకు రూ.10 వేల బహుమతి

ఎమ్మెల్యే సతీమణి మైనం పల్లి శివాణి



నవతెలంగాణ-మెదక్ : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మెదక్ నియోజకవర్గంలోని ఆడపడుచులకు మెదక్ ఎమ్మెల్యే రోహిత్ సతీమణి మైనంపల్లి శివాణి రెడ్డి ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ నెల 11న మెదక్ పట్టణంలోని సిద్దార్థ స్కూల్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ పోటీలలో మొదటి విజేతకు రూ.10 వేలు, ద్వితీయ బహుమతి రూ. 7500, ఉత్తమ ప్రతిభ కనబర్చిన మారో ముగ్గురికి రూ. 5 వేల చొప్పున నగదు ప్రోత్సాహక బహుమతులు అందించనున్నట్టు వెల్లడించారు. వీటితో పాటు పోటీలో పాల్గొన్న మహిళలకు ప్రోత్సాహక బహుమతులను అందిస్తున్నట్టు తెలిపారు. పోటీలో పాల్గొనే మహిళలు ఎవరి రంగులు, వస్తువులు వారే తెచ్చుకోవాలని, నిర్వాహకులు సూచించిన నిబంధనలు పాటించాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9908047659 భవాని, 9491674731 అనితలను ఈ నెల 10వ తేదీ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు ఫోన్ ద్వారా సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

మెదక్ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

సిఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్



నవతెలంగాణ-మెదక్

మెదక్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసంలో మెదక్ శాసన సభ్యులు డా. మైనంపల్లి రోహిత్ రావు మర్యాదపూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోహిత్ మాట్లాడుతూ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, నియోజకవర్గ అభివృద్ధికై నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రిని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందిస్తూ నియోజకవర్గ అభివృద్ధికి త్వరలోనే నిధులను కేటాయిస్తానని హామి ఇచ్చినట్లు తెలిపారు.

కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన సీపీ



నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

సిద్దిపేట కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ బి.అనురాధ సోమవారం కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే ఇచ్చారు. ఆమె ఇదివరకు రాచకొండ కమిషనరేట్ పరిధిలో సైబర్ క్రైమ్ డిసిపిగా విధులు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు బదిలీపై సిద్దిపేట కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా జిల్లాకు విచ్చేశారు. జిల్లాలో శాంతిభద్రతల సంరక్షణ కోసం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆమెకు సూచించారు. ఇది వరకు ఇక్కడ పని చేసిన సీపీ ఎన్.శ్వేత బదిలీపై హైదరాబాద్ సీసీఎస్ డీసీపీగా వెళ్లారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి రవీందర్ ఎంపిక

ఫిబ్రవరి 11న తిరుపతిలో ప్రదానం



నవతెలంగాణ-బెజ్జంకి

డాక్టర్ రాధాకృష్ణ ఉత్తమ ఉపాధ్యాయ జాతీయ పురస్కారానికి మండల పరిధిలోని గుండారం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామంచ రవీందర్ ఎంపికైనట్టు సోమవారం బహుజన సాహిత్య అకాడమి జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ తెలిపారు. ఫిబ్రవరి 11న అంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతిలో నిర్వహించనున్న దక్షిణ భారత బహుజన రచయితల సమావేశంలో రామంచ రవీందర్‌కు డాక్టర్ రాధాకృష్ణ ఉత్తమ ఉపాధ్యాయ జాతీయ పురస్కారం ప్రదానం చేయనున్నట్టు తెలిపారు. జాతీయ పురస్కారానికి ఎంపికైన రామంచ రవీందర్‌ను మండలంలోని ఉపాధ్యాయులు, పలువురు అభినందించారు.

దరఖాస్తుల డేటా ఎంట్రీ ప్రారంభం

- గజ్వేల్ మున్సిపాలిటీలో ఐదు గ్యారెంటీల కోసం 11,171 దరఖాస్తులు
- వ్యక్తిగత సమస్యల కోసం 1820 దరఖాస్తులు
- నియోజకవర్గంలో భారీగా దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-గజ్వేల్

సంక్షేమ పథకాల అమలు కోసం దరఖాస్తు స్వీకరించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం ముగిసింది. డిసెంబర్ 28 నుంచి ఈ నెల ఆరవ తేదీ వరకు గ్రామాలు పట్టణాల్లో దరఖాస్తు స్వీకరించారు. ఎన్నికల్లో ప్రకటించిన ఆరు గ్యారెంటీస్ అమలు చేయడానికి ఎంపిక చేయడానికి ప్రజా పాలన తీసుకొచ్చారు. ఈ క్రమంలోనే పెద్ద సంఖ్యలో ప్రజలు స్పందించి దరఖాస్తులను పెట్టుకున్నారు. మరో నాలుగు నెలల తర్వాత దరఖాస్తు స్వీకరణ ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. మహాలక్ష్మి, గృహలక్ష్మి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత, రైతు భరోసా, సబ్సిడీ గ్యాస్, రెండు వందల విద్యుత్ ఉచితం, రేషన్ కార్డ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీటికి రేషన్ కార్డు, ఆధార్ కార్డు జతపరచాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి లబ్ధిదారునికి రసీదు అందించారు. గజ్వేల్ నియోజకవర్గంలో గజ్వేల్, ములుగు, జగదేవ్పూర్, వర్గల్, కొండపాక, కుక్కునూరు పల్లి, ప్రభుత్వ పథకాలకు రేషన్ కార్డులకు ఇతర సమస్యలకు ప్రజలు పెట్టుకున్న దరఖాస్తులు ఆన్లైన్ లో డేటా ఎంట్రీ ప్రారంభమైంది. ఒక్కొక్క గ్రామానికి ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్ను, అదేవిధంగా మున్సిపాలిటీలో ఒక్కొక్క వార్డుకు ఆపరేటర్ నిర్మించారు. వీరికి శిక్షణ ఇచ్చారు. వీ లబ్ధిదారులు ఏ పథకాలకు దరఖాస్తు చేశారని విషయాన్నీ కూడా ఆన్లైన్ పూర్తయ్యాక తేట తెల్లమవుతుంది. అందుకే ఈ ప్రక్రియను వేగవంతం చేయనున్నారు. మండలాల వారిగా ఇందుకు సంబంధించిన కంప్యూటర్లు ప్రింటర్స్ ఇంటర్నెట్ కనెక్షన్ ఇతర సౌకర్యాలు కల్పించాలని మండలాల వారిగా



ఇందుకు సంబంధించిన కంప్యూటర్లు ప్రింటర్స్ ఇంటర్నెట్ కనెక్షన్ ఇతర సౌకర్యాలు కల్పించాలని ఎప్పటికీ ఆదేశాలు ఇచ్చారు. ఇందులో భాగంగా గజ్వేల్ మండలం 19,952, జగదేవ్పూర్ 16,210 కొండపాక 10,567 కుక్కునూరు పల్లి 6,361. మర్కుక్ 9,017. ములుగు 13,324. వర్గల్ 13,891 దరఖాస్తులు వచ్చాయి. మున్సిపల్ పరిధిలోని ఒకటో వార్డులో ప్రభుత్వ పథకాల కోసం కొన్ని గాక ఇతర సమస్యల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో కొన్ని సమస్యలు కొత్త రేషన్ కార్డులు, కుక్కల సమస్య, మురికి కాలువ, పందులు, రోడ్లు, అనారోగ్యంతో ఉన్నాము సాయం చేయండి అంటూ ఇతర సమస్యల కోసం అర్జీలు పెట్టుకున్నారు. ఒకటో వార్డులో ప్రజాపాలన కింద ఐదు గ్యారంటీలకు 614, ఇతరులు 164 మంది దరఖాస్తు చేసుకున్నారు. రెండో వార్డులో 757 మంది దరఖాస్తు చేసుకోగా, వార్డులు ఇతర సమస్యల కోసం 76 మంది దరఖాస్తు చేసుకున్నారు. మూడో వార్డులో 572 మంది దరఖాస్తు చేసుకోగా ఇతర సమస్యల కోసం 82 దరఖాస్తులు వచ్చాయి. నాలుగో వార్డ్ లో ఐదు గ్యారెంటీ ల కోసం 550 దరఖాస్తులు చేసుకోగా వార్డులో వ్యక్తిగత సమస్యలు 59 కోసం దరఖాస్తు చేసుకోగా ఐదో వార్డులో 651 దరఖాస్తులు వచ్చాయి. ఇతర సమస్యల కోసం 142 దరఖాస్తులు పెట్టుకున్నారు. ఆరో వార్డులో 678 దరఖాస్తులు చేసుకోగా వార్డులో తమ తమ వ్యక్తిగతంగా ఉన్న సమస్యల కోసం 117 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఏడవ వార్డులో కోసం 624 దరఖాస్తు చేసుకోగా వ్యక్తిగత సమస్యల కోసం 90 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఎనిమిదో వార్డులో 515 ముందు దరఖాస్తు చేసుకోగా, 80 మంది ఇతర సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకున్నారు. తొమ్మిదో వార్డులో 585 దరఖాస్తు పెట్టుకోగా, సమస్యల కోసం 88 మంది దరఖాస్తు చేసుకున్నారు. పదవ వార్డులో 568 మంది దరఖాస్తు చేసుకోగా వార్డుల ఇతర సమస్యలు, సౌకర్యాలు కావాలని 114 మంది దరఖాస్తు చేసుకున్నారు. 11 వార్డులో 498 మంది అర్జీలు పెట్టుకోగా ఇతర సమస్యల కోసం 63 మంది దరఖాస్తు చేసుకున్నారు. 12వ వార్డులో ఐదు గ్యారెంటీ ల కోసం 445 మంది దరఖాస్తు చేసుకోగా ఇతర సమస్యల కోసం 60 మంది చేసుకున్నారు. 13వ వార్డులో 537 మంది దరఖాస్తు చేసుకోగా ఇతర సమస్యల కోసం వందమంది దరఖాస్తు చేసుకున్నారు. 14వ వార్డులో 592 మంది దరఖాస్తులు చేసుకోగా ఇతర సమస్యల కోసం 117 మంది దరఖాస్తు చేసుకున్నారు. 15వ వార్డులో 534 మంది అర్జీలు పెట్టుకోగా ఇతర సమస్యల పరిష్కారం కోసం 112 మంది దరఖాస్తు చేసుకున్నారు. 16వ వార్డులో 607 మంది దరఖాస్తు చేసుకోగా ఇతర సమస్యల పరిష్కారం కోసం 113 మంది దరఖాస్తు చేసుకున్నారు. 17వ వార్డులో 514 మంది దరఖాస్తులు చేసుకోగా ఇతర సమస్యల కోసం 76 మంది దరఖాస్తు చేసుకున్నారు. 18 వ వార్డులో 406 అర్జీలు పెట్టుకోగా ఇతర సమస్యల కోసం 72 మంది దరఖాస్తు చేసుకున్నారు. 19వ వార్డులో 435 మంది దరఖాస్తు చేసుకోగా ఇతర సమస్యల కోసం 65 మంది దరఖాస్తు చేసుకున్నారు. 20వ వార్డులో ఐదు గ్యారెంటీ ల కోసం 489 మంది దరఖాస్తు చేసుకోగా ఇతర సమస్యల కోసం 30 మంది ఇతర సమస్యల కోసం 30 మంది దరఖాస్తు చేసుకున్నారు.

అయోధ్య పూజిత అక్షింతల పంపిణీ



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ 18వ వార్డ్ లో సోమవారం అయోధ్య శ్రీరాముని పూజిత అక్షతలు ఇంటింటికి పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు నేతి చిన్న సంతోష్ కుమార్ మాట్లాడుతూ శ్రీ సీతారాముల ఆశీర్వాదంతో అందరూ బాగుండాలని అయోధ్య నుండి వచ్చిన శ్రీరామ పూజిత అక్షింతలు ఇంటింటికి పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాల్గొనడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తూ అయోధ్య లో శ్రీరామ మందిరం నిర్మాణం పూర్తి కావడం సంతోషంగా ఉందని జనవరి 22న అయోధ్య రామ మందిరం ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆరోజు ప్రతి ఇంటిలో ఐదు దీపాలు పెట్టి అందరూ భక్తి శ్రద్ధలతో పూజ కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రామభక్తులు, అమరేందర్ రావు, అత్తెల్లి రవి, సంపత్, విష్ణు,వార్డ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సిద్దన్నపేటలో వైద్య శిబిరం



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలం సిద్దన్నపేట గ్రామంలో సోమవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్ పేషెంట్లకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఆరు నెలలపాటు క్షయ నివారణ మందులు వాడి వ్యాధి బారి నుండి బయటపడి టీబి చాంపియన్ గా గుర్తించిన బొల్లు సాయవ్వను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బెదురు తిరుపతి, నాయకులు డాకూరి భాస్కర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రవి, మల్లేశం, వైద్య సిబ్బంది అర్చన, రాజేశ్వరి, టీబి సూపర్వైజర్ అబ్దుల్ అలీ, హెల్త్ అసిస్టెంట్ భాస్కర్ భట్టు, ఏఎన్ఎం సరస్వతి, ఆశా వర్కర్లు మమత, చంద్రకళ, అంగన్వాడీ టీచర్ గంగా భవాని, బ్యాంకు సిబ్బంది, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యత నగుబాటు

- రూ.కోట్ల ప్రజాధనం గంగపాలు
- నిర్మించిన ఏడాదిలోపే వరదకు కొట్టుకుపోయిన ఖాతా చెక్ డ్యాం
- వెంటనే మరమ్మతులు చేపట్టాలని రైతుల డిమాండ్

నవతెలంగాణ-నంగునూరు

వృథా నీటికి అడ్డుకట్టి, భూగర్భ జలాలు పెంచాలనే ఉద్దేశంతో నంగునూరు మండలంలోని ఖాతా, ఘనపూర్, నంగునూర్, అక్కనపెల్లి పెద్దవాగుపై 20 సంవత్సరాల కాలంలో దశలవారీగా ఏడు చెక్ డ్యాములు నిర్మించారు. దీంతో వాగు పరిసర ప్రాంతంలో ఆయకట్టు సాగు పెరిగింది. ఖాతా గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే హరీష్ రావు ఖాతాలో గతంలో నిర్మించిన చెక్ డాం ఎగువ ప్రాంతంలోని సందిటి వెంకట్ రెడ్డి వ్యవసాయ క్షేత్రం వద్ద రూ.4.60 కోట్ల వ్యయంతో, దిగువ భాగంలో దారం తిరుపతిరెడ్డి వ్యవసాయ క్షేత్రం వద్ద రూ.4.75 కోట్లతో మరో చెక్ డాం నిర్మాణానికి 2020 మే నెలలో అప్పటి మంత్రి హరీష్ రావు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఏడాది అనంతరం సంబంధిత కాంట్రాక్టర్ పనులు చేపట్టి 2022లో పనులను పూర్తి చేశారు. 2023 వర్షాకాలంలో వచ్చిన వరదలకు సందిటీ వెంకటరెడ్డి వ్యవసాయ క్షేత్రం వద్ద రూ.4.60 కోట్లతో నిర్మించిన చెక్ డ్యాం వరద దాటికి రెండుగా చీలి కొట్టుకుపోయింది. ఈ చెక్ డ్యాం నిర్మాణంతో పెద్దవాగులో కిలోమీటర్ మేర 10 అడుగుల లోతుతో నిలవాల్సిన నీరు వృథాగా కిందికి పోయింది. రెండు పంటలకు ఈ చెక్ డ్యాంలో నీరు సమృద్ధిగా ఉండేది. వానాకాలం పంటలు పుష్కలంగా పండాయి. యాసంగిలో వాగు పరివాహక ప్రాంతంలో వరి పంట వేసినా కోత దశలో వాగు నీరు అడుగంటే ప్రమాదం ఉంది. మరో కొంత మంది రైతులు యాసంగి పంటలకు దూరంగా ఉన్నారు. నాణ్యతాలోపం, అధికారుల నిర్లక్ష్యంతో కోట్ల ప్రజాధనం గంగపాలైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోట్ల వ్యయంతో నిర్మించిన చెక్ డ్యాం పది కాలాలపాటు మన్నికగా ఉండాల్సిన చెక్ డ్యాం ఏడాదిలోపే చిన్న వరదకు కొట్టుకపోవడం నాసిరక నిర్మాణ పనులకు నిదర్శనమని రైతులు ఆరోపిస్తున్నారు. నంగునూరు, ధూళ్మిట్ట మండలాల



ఆయకట్టు రైతులకు ఈ వాగు నీరు ఎంతో మేలు చేస్తుంది. 20 ఏళ్ల కింద ఇదే పెద్ద వాగు పై ఏడు చెక్ డాములు నిర్మించినప్పటికీ చెక్కు చెదరకుండా ఆయకట్ట రైతులకు రెండు పంటలకు సమృద్ధిగా నీరు అందిస్తున్నాయి. చెక్ డ్యాం కొట్టుకపోయిన విషయాన్ని ఇరిగేషన్ అధికారులకు, నాయకులకు విన్నవించిన పట్టించుకోవడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెక్ డ్యాంకు మరమ్మతులు చేపట్టాలని ఆయకట్ట రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ అధికారులను వివరణ కోరగా సంబంధిత కాంట్రాక్టర్‌తో మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ -గజ్వేల్

కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలు సద్వినియోగం చేసుకునేలా ఏర్పాటు చేసిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రచార రథం సోమవారం గజ్వేల్ మండలం బెజుగామలోని గ్రామ పంచాయతీకి చేరుకుంది. కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిపించే కార్యక్రమంలో సెంట్రల్ టీం సురేంద్ర సింగ్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు దూది శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో వారితో పాటు వివిధ బ్యాంక్ లకు చెందిన బ్యాంక్ మేనేజర్లు అగ్రికల్చర్. హెల్త్. గ్యాస్ డిపార్ట్మెంట్ లకు చెందిన పదాధికారులు హాజరయ్యారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు పెద్దలు యువకులు భాజపా నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతలు ప్రతి ఇంటికి పంపిణీ



నవతెలంగాణ -గజ్వేల్

ఈ నెల 22న జరిగే అయోధ్యలో శ్రీరాముని ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహించేందుకు గ్రామ గ్రామాన ఇంటింటా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి అన్నారు. సోమవారం మున్సిపల్ చైర్మన్ ప్రాతినిధ్యమయిస్తున్న 18వ వార్డులో ఇంటింటికీ అయోధ్య అక్షంతలు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరాములు ప్రతిష్టను విజయవంతం చేసేందుకు గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ప్రజలు ఉత్సాహంగా ముందుకు వస్తున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్తే ఘన స్వాగతం పలుకుతున్నారని ఆయన అన్నారు. కార్యక్రమంలో భారత రాష్ట్ర సమితి యువత నాయకులు నేతి చిన్న సంతోష్, అమరేందర్ రావు, రవీందర్, విష్ణు, నాగేష్, నరేందర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-మర్కుక్

పీఆర్టీయూ 2024 క్యాలెండర్‌ను సోమవారం మండలంలోని గణేష్ పల్లి ప్రథమిక పాఠశాల ఆవరణలో పీఆర్టీయూ మర్కుక్ మండల శాఖ ఆధ్వర్యంలో మండల విద్యాధికారి ఉదయ్ భాస్కర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు ఆధారసు పల్లి శశిధర్ శర్మ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శశిధర్ శర్మ మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు నిర్వహించాలని, పెండింగ్ బిల్స్ చెల్లించాలని, పాఠశాలలో స్కావెంజర్ లను నియమించాలని, సిపిఎస్ రద్దు పరచాలని తెలిపారు. కార్యక్రమంలో మర్కుక్ మండల శాఖ అధ్యక్షులు నారెడ్డి రామ కృష్ణా రెడ్డి, ప్రధాన కార్యదర్శి తుమ్మ కుమార్,రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఆర్.శ్రీనివాస్ రావు, ఎస్.లక్ష్మీ నారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు నర్సింలు, షాబోద్దీన్, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ చారి నాయకులు రమణారావు, దిలీప్, జైపాల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులున్నారు.

బద్దిపడగలో అయోధ్య అక్షింతల పంపిణీ



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలంలోని బద్దిపడగ గ్రామంలో సోమవారం అయోధ్య అక్షింతలు పంపిణీ చేశారు. ఈ నెల 22న జరగనున్న రామ మందిర ప్రారంభోత్సవం దేశ వ్యాప్తంగా కన్నుల పండుగగా జరగనున్న నేపథ్యంలో బద్దిపడగ సీత రామచంద్రస్వామి ఆలయ అర్చకులు కన్నన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రాములవారి అక్షింతలను ప్రధాన వీధుల గుండా మంగళ హారతులతో తిరుగుతూ అక్షింతలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వేముల కొండల్ రెడ్డి, ఎంపీటీసీ ఎడ్ల జ్యోస్న నర్సింహారెడ్డి, ఉప సర్పంచ్ రేపాక రాజేందర్, రామ భక్తులు బచ్చు వేంకటేశం, కొలిపాక వెంకటరాజం, గౌరబోయిన రాములు, తప్పేట పర్శరాములు, రజినికర్, సతీష్, రాజు, వెంకటేష్, విశ్వనాథం, భాస్కర్, ఎల్లయ్య ధనరాజ్, పృథ్విరాజ్, శివ, మనిదీప్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-నంగునూరు

కార్మిక, కర్షక, ప్రజా సమస్యలను వెలికితీస్తూ పరిష్కారం కోసం నవ తెలంగాణ పత్రిక ముందంజలో ఉంటుందని నంగునూరు గ్రంథాలయ లైబ్రేరియన్ ఉమాపతి పేర్కొన్నారు. సోమవారం నంగునూరు గ్రంథాలయంలో నవతెలంగాణ క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలను గుర్తించి పరిష్కారం కోసం నవ తెలంగాణ పత్రిక పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట పీసీ ఇంచార్జి సొప్పరి రాములు, గ్రంథాలయ సిబ్బంది సుధాకర్, రాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-మర్కుక్

పౌష్టికాహారంతో ఆరోగ్యంగా ఉంటామని, చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలని మర్కుక్ ఎంపీపీ పాండు గౌడ్, జెడ్పిటిసి యెంబరి మంగమ్మ రామచంద్రం యాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని ఎర్రవల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల వద్ద భవనంలోకి మార్చిన సందర్భంగా గ్రామ సర్పంచ్ మొండి బాగ్య బిక్షపతితో కలిసి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నపిల్లలకు ఆట వస్తువులు, కుర్చోవడానికి కుర్చీలు, టేబుల్స్ దాతల సహకారంతో సుమారు మూడు లక్షల రూపాయలతో ఏర్పాటు చేయించిన సర్పంచ్ భాగ్య బిక్షపతిని అభినందించారు. మండలంలోనే ఎర్రవల్లి అంగన్వాడి కేంద్రం మోడల్ గా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు సంధ్యారాణి,అంగన్వాడి టీచర్ నాగలక్ష్మి, ఆయమ్మ ఎల్లమ్మ, వార్డు సభ్యులు శేఖర్, భాగ్య శ్రీశైలం, సుజాత యాదగిరి, బిఆర్ఎస్ గ్రామ శాఖ



అధ్యక్షులు వెంకట్ రెడ్డి, సీనియర్ నాయకులుప్రభాకర్ రెడ్డి,కొమురయ్య, రఘుపతి రెడ్డి, పాండు, చిన్నరెడి ,తదితరులున్నారు.

దుబ్బాక ఎమ్మెల్యే కొత్తను కలిసిన జెడ్పీటీసీ



నవతెలంగాణ-గజ్వేల్

నెలరోజుల క్రితం శాసనసభ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి నీ గజ్వేల్ జెడ్పిటిసి పంగ మల్లేశం సోమవారం కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దుబ్బాక ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న పార్లమెంటు ఎన్నికల్లో సిట్టింగ్ స్థానాన్ని కైవాసం చేసుకోవాలని దీనికోసం ఇప్పటినుండి మండల ప్రజా ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు సైనికులుగా పనిచేయాలని ఆయన సూచించారు. మెదక్ పార్లమెంట్ స్థానం తిరిగి కైవాసం చేసుకోవాలని ఆయన సూచించారు. అభ్యర్థి ఎవరైనా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు సూచన సలహాలతో ముందుకు వెళ్దాం అన్నారు. కష్టపడ్డ వారికి పార్టీ అండగా ఉంటుందని ఆయన అన్నారు.

జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌లో జితీష్‌కు ప్రథమ బహుమతి

నవ తెలంగాణ-సిద్దిపేట

జిల్లా స్థాయి స్పోర్ట్స్‌లో శ్రీవాణి స్కూల్‌కు చెందిన విద్యార్థి గడిచెర్ల జితీష్‌కు పప్రథమ బహువ ఎతి లభించింది. సిద్దిపేట డిస్టిక్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్టాండింగ్ బోర్డ్ జంప్, రన్నింగ్ పోటీలలో (అండర్ 8)లో అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో గోల్డ్ మెడల్, సర్టిఫికేట్ పొందినట్లు శ్రీవాణి స్కూల్ డైరెక్టర్ సి.హెచ్.సత్యం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాలలో రాణించడానికి తమ పాఠశాల కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం విద్యార్థి జితీష్‌కు స్కూల్ తరుపున మెమెంటో అందించి అభినందించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కృపాకర్, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




వాసవీక్లబ్ రీజియన్ చైర్ పర్సన్‌గా మాంకాల శ్రీనివాస్

నవ తెలంగాణ-సిద్దిపేట

వాసవి క్లబ్ రీజియన్ చైర్‌పర్సన్‌గా సిద్దిపేటకు చెందిన మాంకాల శ్రీనివాస్‌కు జిల్లా వి 105ఏ గవర్నర్ భానూరి నర్సింలు నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా మాంకాల శ్రీనివాస్ మాట్లాడుతూ తన ఆధ్వర్యంలో కొన్ని క్లబ్‌లు ఉంటాయని వాటి ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. రీజియన్ చైర్మన్‌గా నియమించిన వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ గంప శ్రీనివాస్, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ మల్టిపుల్ కొర్తివాడ రాజేందర్, భానూరి నర్సింలు, గంప కృష్ణమూర్తి , మంకాల నవీన్ కుమార్ కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

నేడు గోధా రంగానాథ కల్యాణం



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలం పాలమాకుల గ్రామంలోని వేంకటేశ్వరాలయంలో మంగళవారం గోధా రంగనాథస్వామి కల్యాణం వేడుకగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సిద్దిపేట వికాస తరంగిణి ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు ఊరేగింపు, స్వామివారి ఉత్సవ విగ్రహాలకు శోభయాత్ర నిర్వహిస్తామన్నారు. కల్యాణంలో పాల్గొనే భక్తులు ముందుగా పేర్లు నమోదు చేయించుకోవాలని పూజారి డింగరి విష్ణుతేజాచార్యులు సూచించారు.

పాఠశాల రికార్డులను తనిఖీ చేసిన జిల్లా అధికారులు

నవతెలంగాణ-జగదేవపూర్



మండల విద్యా శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాలను సోమవారం జిల్లా అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అందులో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చాట్లపల్లి, మునిగడప, తెలంగాణ మోడల్, ప్రాథమిక పాఠశాల జగదేవపూర్‌లను పరిశీలించారు. విద్యార్థుల వివరాలను పాఠశాల రికార్డులు సరిగ్గా ఉన్నాయా లేదా అని ఆన్లైన్ వివరాలతో సరిచూశారు. అడ్మిషన్ రిజిష్టర్‌లను తనిఖీ చేశారు. పలు అంశాలపై ప్రధాన ఉపాధ్యాయులు, సీఆర్పీలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, అకాడమిక్ మానిటరింగ్ అధికారి రామస్వామి, ఏఎస్ఓ నర్సింహులు, ఆయా పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులు, సీఆర్పీ దయానంద్ ఉన్నారు.

పారిశుద్ధ్య కార్మికులను ఆదుకోవాలి

డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి

నవతెలంగాణ జగదేవపూర్



జగదేవ్‌పూర్ మండల్ తీగుల్ గ్రామంలో బతుకమ్మ పండుగ నాడు మృతి చెందిన ముగ్గురి పారిశుద్ధ్య కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని కోరుతూ సోమవారం గజ్వేల్ ఆర్డీవో కార్యాలయంలో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ద్వారా త్వరితగతిన సహాయం అందించాలని కోరారు. ఈ సందర్భంగా ఏగొండ స్వామి మాట్లాడుతూ గత బతుకమ్మ పండుగ అక్టోబర్ 14న పారిశుధ్య కార్మికులు బతుకమ్మలు వేసే చెరువు దగ్గర మెట్లు శుభ్రం చేసేక్రమంలో గిరిపల్లి భారతమ్మ, కర్రమెల్ల బాబు, ఎల్లం యాదమ్మ ముగ్గురు ఒకే రోజు మరణించారు. నాడు ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున సహాయం చేయలేకపోయారని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు.

ఇథనాల్ పరిశ్రమపై నీలినీడలు?

- పరిశ్రమను రద్దు చేయాలని గుగ్గీల్ల గ్రామస్తుల పట్టు
- ప్రజలకు సందేహాలు నివృత్తి చేయడంలో అధికారులు విఫలం



నవతెలంగాణ-బెజ్జంకి

ఇథనాల్ ఒక ఇంధనమే. చమురు దిగుమతులకయ్యే ఖర్చును ఆదా చేయడం కోసం ప్రభుత్వాలు ఇథనాల్ ఇంధన తయారీపై దృష్టి సారించాయి. ఇప్పటివరకు చెరుకు నుంచి వచ్చే మొలాసిస్ ద్వారా మాత్రమే ఇథనాల్ తయారు చేసేవారు. ఇప్పుడు వ్యవసాయ వ్యర్థాల ద్వారా ఇథనాల్ ఇంధనాన్ని తయారు చేసే విధంగా ప్రభుత్వాలు పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నాయి. మండల పరిధిలోని గుగ్గీల్ల గ్రామ శివారులో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు జారీ చేసింది. ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు జారీ చేయడాన్ని గ్రామస్తులు వ్యతిరేకిస్తున్నారు. గ్రామసభ ఏర్పాటు చేయకుండా దొడ్డిదారిన పలువురు పాలకవర్గం సభ్యులు ఏకపక్షంగా వ్యవహరించి పరిశ్రమ నిర్మాణానికి ఎన్ఓసీ జారీ చేయడంతో ప్రజల చేత ఎన్నుకోబడిన పాలకవర్గం సభ్యులు ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నారని గ్రామస్తులు గ్రామ పంచాయతీ కార్యలయం వద్ద అందోళనలు సైతం చేపట్టారు.ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన అభయహస్తం దరఖాస్తుల స్వీకరణలో మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఎదుట ఇథనాల్ పరిశ్రమ నిర్మాణ అనుమతులను రద్దు చేయాలనే గ్రామస్తుల ఆక్రోశం వెల్లడించారు.ఇథనాల్ పరిశ్రమ నిర్మాణంపై గ్రామ ప్రజల్లో నెలకొన్న సందేహలను నివృత్తి చేసేల పూర్తి స్థాయిలో నిపుణులతో చర్చించి పరిశ్రమ నిర్మాణంపై పునరాలోచన చేద్దామని ఎమ్మెల్యే గ్రామస్తులను సద్దుమనిగించారు.పరిశ్రమను రద్దు చేయాలని ప్రజలు దృడ సంకల్పంతో ఉండడం పరిశ్రమ నిర్మాణంపై నీలినీడలు అలుముకున్నాయి.



ఇథనాల్ ఇంధన తయారీతో ఉపయోగాలు

ఇప్పటికే చమురు ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి.చమురు ధరలను నియంత్రించాలంటే ఇతర దేశాల నుండి చమురు దిగుమతులను తగ్గించుకుని ప్రత్యామ్నాయ మార్గాలను ప్రభుత్వాలు అన్వేషించాలి.చమురు ఇందనాల్లో సుమారు 20 శాతం ఇథనాల్ ఇందనాన్ని కలపడం ద్వార చమురు దిగుమతులకయ్యే ఖర్చును తగ్గించుకోవచ్చు.వ్యవసాయ వ్యర్థాలతో ఇథనాల్ తయారు చేయడం వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతోందని నిపుణులు వెల్లడిస్తున్నారు.

తయారీతో నష్టాలు

ఇథనాల్ వాడకం ద్వారా కొన్ని నష్టాలు కూడా ఉన్నాయి అంటున్నారు శాస్త్రవేత్తలు. ఇథనాల్ తయారీతో బియ్యం, గోధుమలు,మొక్కజొన్న, సోయా వంటివాటి ధరలు పెరుగుతాయి.అంతేకాకుండా లీటరు ఇథనాల్ తయారు చేయాలంటే మూడు వేల లీటర్ల నీరు అవసరం పడుతుందని అంచనా. దీంతో నీటి జలాలకు తీవ్ర ముప్పు లేకపోలేదు. జాగ్రత్తలు తీసుకుంటూ ముందుకు సాగాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇతర వ్యర్థాలతో ఇథనాల్ తయారు చేసుకుంటే సమస్య ఉండదు.ఆహారధాన్యాలపైనే పూర్తిగా ఆధారపడటం భవిష్యత్తులో ముప్పు వాటిల్లుతుంది. పర్యావరణానికి హాని తలపెట్టకుండా, ఆహార భద్రతకు ముప్పు రాకుండా ఇథనాల్ తయారీ, వినియోగం వైపు అడుగులు వేస్తేనే మెరుగైన ఫలితాలు సిద్ధిస్తాయని సూచిస్తున్నారు.

ఇథనాల్ పరిశ్రమ వద్దు

మా గ్రామ శివారులో నిర్మించ తలపెట్టిన ఇథనాల్ పరిశ్రమ వద్దని డిసెంబర్ 8,2023న ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చిన హుస్నాబాద్ డివిజన్ డీఎల్ పీఓ వీరభద్రయ్య ఎదుట గుగ్గీల్ల గ్రామస్తులందరం ప్రాదేయపడ్డాం.ఇథనాల్ పరిశ్రమ నిర్మాణాన్ని, అనుమతులను ప్రభుత్వం రద్దు చేసి ప్రజల ప్రభుత్వమనే నిర్వచనానికి స్వార్ధకతగా నిలువాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

– గుగ్గీల్ల గ్రామస్తులు

పరిశ్రమలు నెలకొల్పేటప్పుడు ప్రజల్లో వెల్లవెత్తుతున్న సందేహాలను నివృత్తి చేయడం అనివార్యం. వాటి ఉపయోగాలు, నష్టాలేమిటో ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాధికారులకు ఉంటుంది. అధికారులు పరిశ్రమల యాజమాన్యాలకు వంతపాడడం వల్ల పరిశ్రమ ఏర్పాటులో సమస్యలు ఉత్పన్నమవుతూనే ఉంటాయి. అధికారుల వ్యవహరిస్తున్న తీరు వల్ల మండల పరిధిలోని గుగ్గీల్ల గ్రామ శివారులో ఇథనాల్ పరిశ్రమ నిర్మాణంపై నీలినీడలు కమ్ముకున్నాయి. గ్రామ శివారుల్లో ఇప్పటికే నెలకొల్పిన పారా బాయిల్డ్ రైస్ మిల్లుల నుండి వెలువడుతున్న వ్యర్థాలతో దుర్వాసనతో పాటు వాతావరణంపై దుష్ప్రభావం పడుతూ... ప్రజలు అనారోగ్య సమస్యలతో పాటుగా జీవాధారమైన వ్యవసాయ పంటలకు నష్టం వాటిల్లుతోందని, మళ్లీ ఇథనాల్ పరిశ్రమతో భవిష్యత్తులో జీవాధారం కోల్పోయి దారిద్ర్యపు దుస్థితిని ఎదుర్కోక తప్పదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పరిశ్రమ నిర్మాణాన్ని ప్రభుత్వం రద్దు చేయాలని గ్రామస్తులు పట్టు పడుతున్నారు. ఇథనాల్ పరిశ్రమ వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమవ్వడంతోనే రద్దు చేయాలని గ్రామస్తుల్లో ఆందోళన మొదలైందని మేధావులు పేర్కొంటున్నారు. పరిశ్రమ యాజమాన్యం ప్రజలతో మమేకమవ్వకుండా దళారులతో చేతులు కలిపి వ్యవహరిస్తున్నట్టు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీంతో ఇథనాల్ పరిశ్రమ నిర్మాణంపై యాజమాన్యం మల్లగుల్లాలు పడుతున్నట్టు వినికిడి.

శ్రీరామకోటి భక్త సమాజం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ

నవతెలంగాణ-గజ్వేల్



హిందువులు పవిత్రంగా చేసుకునే సంక్రాంతి పండుగను పురస్కరించుకుని రామకోటి భక్త సమాజం ఆధ్వర్యంలో తాలూకా స్థాయిలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షులు రామకోటి రామరాజు తెలిపారు. ఈ పోటీలో మహిళలు అందరూ పాల్గొనవచ్చన్నారు. ఎ4 సైజు పేపర్లో చుక్కలతో కూడి తగు రంగులతో ముగ్గులు వేసి స్వయంగా గాని, లేదా పోస్ట్, కొరియర్ ద్వారా పంపాలన్నారు. ప్రథమ ద్వితీయ, తృతీయ, 50 కన్సోలేషన్ బహుమతులు ఉంటాయన్నారు. ముగ్గులు పంపవలసిన చివరి తేదీ: 13-1-2024, చిరునామా శ్రీరామకోటి భక్త సమాజం, రామకోటి రామరాజు ఇంటి నెంబర్. 5-184, విద్యానగర్, గజ్వేల్ జిల్లా సిద్దిపేట, పిన్ 502278, సెల్: 984 984 7944. కాగా ముగ్గుల పోటీలను రామకోటి సంస్థ ఆధ్వర్యంలో గత 20సంవత్సరాల నుంచి నిర్వహిస్తున్నారు.

చేర్యాల రెవెన్యూ డివిజన్ మద్దూరు కో కన్వీనర్‌గా ఉదయ్ కుమార్ రెడ్డి

నవతెలంగాణ-మద్దూరు



చేర్యాల రెవెన్యూ డివిజన్ మద్దూరు కో కన్వీనర్‌గా గాగిల్లాపూర్ గ్రామానికి చెందిన మోకు ఉదయ్ కుమార్ రెడ్డిని నియమించినట్లు చేర్యాల జేఏసీ డివిజన్ చైర్మన్ భైరవభట్ల చక్రధర్, సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన కోసం తనవంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. తనపై నమ్మకంతో చేర్యాల రెవెన్యూ డివిజన్ కో కన్వీనర్‌గా నియమించినందుకు. చేర్యాల జేఏసీ డివిజన్ చైర్మన్ భైరవభట్ల చక్రధర్, మద్దూరు మండల జేఏసీ కన్వీనర్ పాకాల ఇసాక్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

మంత్రులను కలిసిన గజ్వేల్ నేతలు



నవతెలంగాణ-గజ్వేల్

తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్‌లో మంత్రులను గజ్వేల్ నాయకులు సోమవారం కలిశారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలను గజ్వేల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గజ్వేల్ మహేష్‌లు కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ మెదక్ పార్లమెంటు ఎన్నికల్లో విజయం సాధించేందుకు కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని వారు కోరారు.

పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ జగదేవపూర్



జగదేవపూర్‌లోని మండల వనరుల కేంద్రంలో సోమవారం మండల శాఖ అధ్యక్షులు చిలుకూరి వెంకట్రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి రాత్లావత్ బొద్దు నాయక్ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా అధ్యక్షులు శశిధర్ శర్మ, మండల విద్యాధికారి ఉదయ భాస్కర్‌రెడ్డి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సైదులు, కనకయ్య, వట్టిపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరోజ పీఆర్టీయూ 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు శశిధర్ శర్మ మాట్లాడుతూ ఎఫ్ఎల్ఎన్, ఉన్నతి ప్రోగ్రాం ద్వారా ఉపాధ్యాయులు మానసికంగా ఒత్తిడికి గురైన సందర్భాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. దీంతో బోధనకు ఆటంకం కలుగుతుందని తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పై రాష్ట్ర ప్రభుత్వంతో చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రవికుమార్, జిల్లా కార్యదర్శి గణేష్ , జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి జ్యోతిరెడ్డి,మండల ఉపాధ్యక్షులు రాధిక, మండల కార్యదర్శి మోతిరామ్, సీనియర్ నాయకులు నరసింహారెడ్డి, శివప్రసాద్ మహమ్మద్ అలీ, భగవాన్ రెడ్డి, నరేందర్ రెడ్డి,కనకదుర్గ, సావిత్రి, సునీత, గీత ,సీఆర్పీలు రమణ కుమార్, దయానంద్ తదితరులు ఉన్నారు.

అప్పాయపల్లిలో వికసత్ భారత్ సంకల్పయాత్ర

నవతెలంగాణ-దౌల్తాబాద్



దౌల్తాబాద్ మండల పరిధిలోని అప్పాయపల్లి గ్రామంలో సోమవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. దౌల్తాబాద్ ఏపీజీవీబీ బ్యాంక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్ కుక్కల సుకున మాట్లాడుతూ కేంద్రం సంక్షేమ పథకాలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వికసత్ భారత్ సంకల్ప యాత్ర దేశవ్యాప్తంగా పేద ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాలు అందించే అంశాలను ఎల్ఈడి ప్రొజెక్టర్ ద్వారా వివరించడం జరుగుతుందని అన్నారు. బ్యాంకు ఖాతా తీసుకోవడం వల్ల ఉపయోగాలు ఖాతాను ఎలా వాడాలి? కుటుంబ బడ్జెట్, వ్యక్తి బడ్జెట్, బ్యాంక్ ఖాతా రకాలు, ఈకేవైసీ నామినీ ప్రాముఖ్యత, భీమా రకాలు పీఎం జేజే బి, పీఎం ఎస్బి వై, ఉజ్వల, ఆయుష్మాన్ భారత్ గురించి వివరించారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ కిరణ్ కుమార్, ఉప సర్పంచ్ కేశ బోయిన ప్రభాకర్ ఏఎన్ఎం రేణుక, ఆశ వర్కర్ సరిత,సురేష్,నర్సింలు, గ్రామస్తులు తదితరులు పాల్గొనడం జరిగింది.. సి ఎఫ్ ఎల్ కో ఆర్డినేటర్స్ స్వామి. శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీపీ అనురాధను కలిసిన హుస్నాబాద్ ఏసీపీ



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

నూతనంగా సిద్దిపేట పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఐపీఎస్ అనురాధను సిద్దిపేట పోలిస్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం హుస్నాబాద్ ఏసిపి సతీష్, సీఐ ఎర్రల్ల కిరణ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు.

గాజులపల్లిలో ఇంటింటా అక్షింతల పంపిణీ



నవ తెలంగాణ దౌల్తాబాద్

అయోధ్యలో శ్రీరామచంద్రుల విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం కోసం గాజులపల్లి గ్రామానికి చేరుకున్న రాములోరి అక్షింతలను రామనామ జపం జరుపుతూ ఇంటింటా పంపిణీ చేసినట్లు గాజులపల్లి అప్పవారు శ్రీనివాస్ అన్నారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో అయోధ్య శ్రీరాముడి అక్షింతలు పంపిణీ చేపట్టారు. ఈనెల 22వ తేదీన ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అయోధ్య ప్రాంతంలో శ్రీరామచం ద్రుల విగ్రహ ప్రతిష్టాపన చేస్తారని తెలిపారు. గ్రామస్తులు, యువత ఉన్నారు

టీపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-రాయపోల్



ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నామని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అమ్మన భాస్కర్‌రెడ్డి అన్నారు. టీపీటీఎఫ్ 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం రాయపోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల శాఖ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం చేయాలన్నారు. 317 జీవో బాధితులకు న్యాయం చేయాలన్నారు. మొదటి తేదీన వేతనాలు చెల్లించాలన్నారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సంవత్సరాల తరబడి పేరుకుపోయిన ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు చేపట్టాలన్నారు. బదిలీ అయి రిలీవ్ కాని ఉపాధ్యాయులను వెంటనే రిలివ్ చేయాలని, ఉపాధ్యాయులను ఒత్తిడికి గురి చేస్తున్న ఎఫ్ఎల్ఎన్, ఉన్నతి కార్యక్రమాలను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు చంద్రం, సీనియర్ నాయకులు రాములు, జిల్లా ఉపాధ్యక్షులు సుంచు నరేందర్, జిల్లా కార్యదర్శి గోక విద్యాసాగర్, మండల శాఖ అధ్యక్షులు శేషాచారి, ప్రధాన కార్యదర్శి కనక రాజు, మండల ఉపాధ్యాయులు సుగుణాకర్ రెడ్డి, మెట్టురామ్, ప్రభాకర్, సంజీవ్, వెంకట్, నర్సింగరావు, కనకయ్య స్వామి, వరప్రసాద్, శ్రీనివాస్, నాగస్వామి, ప్రశాంత వర్ధన్, జయశ్రీ, స్వరూప, రమ్య రమ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ గృహప్రవేశం చేసిన మంత్రి



నవతెలంగాణ హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం వేద పండితులతో పూజలు చేసి గృహప్రవేశం చేశారు.హుస్నాబాద్ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య పిసిసి సభ్యులు కేడం లింగమూర్తి నాయకులు పాల్గొన్నారు.

సన్మాన సభను విజయవంతం చేయండి

- టీయూడబ్ల్యూజే జిల్లా కోశాధికారి కృష్ణ

నవతెలంగాణ జగదేవ్‌పూర్

టీయూడబ్ల్యూజే(ఐజేయూ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన విరాహత్ అలీకి ఈ నెల 10న గజ్వేల్ సన్మాన సభను ఏర్పాటు చేస్తున్నట్లు టీయూడబ్ల్యూజే సిద్దిపేట జిల్లా కోశాధికారి డి కృష్ణ, ఐజేయూ సభ్యులు బాల్ నర్సయ్య తెలిపారు. సోమవారం జగదేవ్‌పూర్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ మూడున్నర దశాబ్దాల జర్నలిస్టు జీవితంలో ఎన్నో ఆటు పోట్లను ఎదుర్కొని, ఉమ్మడి మెదక్ జిల్లాలో జర్నలిస్టు సంఘ ఏర్పాటులో కీలక భూమిక పోషించి ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శి గా పని చేసి, అంచెలంచెలుగా రాష్ట్ర అధ్యక్షుడిగా ఎదిగారని తెలిపారు. జర్నలిస్టుల ఆశాదీపంగా, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న వెలుగుదివ్వెగా ఎందరో అభాగ్యులకు అండగా నిలుస్తూ సొంత గడ్డకు ఖ్యాతి తెచ్చిన గజ్వేల్ మట్టి బిడ్డవిరాహత్ అలీ రాష్ట్రంలో ప్రతిష్టాత్మక వర్కింగ్ జర్నలిస్టుల సంఘానికి (టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా గజ్వేల్ జర్నలిస్ట్ కాలనీ వెల్ఫేర్ సొసైటీ, మరియు గజ్వేల్ ప్రెస్ క్లబ్ ల సంయుక్త ఆధ్వర్యంలో ఆయనకు సన్మాన సభ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ నెల 10న గజ్వేల్ పట్టణంలోని మల్లారెడ్డి ఫంక్షన్ హాల్‌లో సాయంత్రం 6 గంటలకు నిర్వహించే సన్మానసభకు జర్నలిస్టులు,



మేధావులు, ఉపాధ్యాయ, ఉద్యోగులు, సంఘాల నాయకులు, కవులు, బుద్ధి జీవులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు నర్సింలు, పరుశురాం, బలరాం పాల్గొన్నారు.

మాయమాటలతో మభ్యపెడుతున్న కాంగ్రెస్

నవతెలంగాణ-మిరు దొడ్డి



కాంగ్రెస్ ప్రభుత్వం మాయమాటలు చెబుతూ ప్రజలను మభ్యపెడుతోంతని టీఆర్ఎస్ జిల్లా నాయకుడు సిద్ది భారతి భూపతి గౌడ్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ నేటి వరకూ రైతుబంధు పథకాన్ని ఎందుకు అమలు చేయడంలేదని ఆరోపించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే రైతుల ఖాతాలో రైతుబంధు డబ్బులు వేయాలన్నారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు నంట బాబు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ముత్యాల భూపాల్ మాదిగ

నవతెలంగాణ-మిరుదొడ్డి



మాదిగ రిజర్వేషన్ కోటా సమితి రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపన్న, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపాధ్యక్షులుగా సిద్దిపేట జిల్లాకు చెందిన ముత్యాల భూపాలను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏబిసిడి వర్గీకరణ కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మాదిగల పట్ల మొండి వైఖరి అవలంబిస్తున్నాయని తెలిపారు. తనపై నమ్మకంతో రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపయ్య రాష్ట్ర అధికార ప్రతినిధి గుర్రాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమించినందుకు ధన్యవాదాలు తెలిపారు.

10న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

నవతెలంగాణ- దుబ్బాక

విద్యుత్ వినియోగదారుల సమస్యలపై సీజీఆర్ఎఫ్ (కన్స్యూమర్ గ్రీవెన్స్ రెడ్రెస్సెల్ ఫోరం హైదరాబాద్) ఆధ్వర్యంలో ఈ నెల 10న పరిష్కార వేదిక ఏర్పాటు చేయనున్నట్లు విద్యుత్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సీహెచ్ రాంబాబు సోమవారం తెలిపారు. విద్యుత్ బిల్లుల్లో సమస్యలు, కొత్త సర్వీసులు ఇవ్వడం, పేరు మార్పిడి, సర్వీసు కేటగిరి మార్పిడి, విద్యుత్ సరఫరా పునరుద్దరణ, బకాయిల చెల్లింపు ఇలా పలు విద్యుత్‌కు సంబంధించి ఏ సమస్య ఉన్నా ఈ నెల 10న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు దుబ్బాకలోని రామసముద్రం చెరువు కట్ట పక్కన గల అసిస్టెంట్ డివిజన్ ఇంజనీర్ (33/11 కెవి సబ్ స్టేషన్ పక్కన) కార్యాలయం వద్ద నిర్వహించే పరిష్కార వేదికకు సకాలంలో హాజరుకావాలని కోరారు. దుబ్బాక సబ్ డివిజన్ పరిధిలోని దుబ్బాక, మిరుదొడ్డి, అక్బర్‌పేట భూంపల్లి మండలాల విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. వినియోగదారులు ఆధార్ కార్డు, కరెంట్ బిల్లు రసీదులను తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు.

టీపీటీఎఫ్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



నవ తెలంగాణ - సిద్దిపేట

టీపీటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని అడిషనల్ కలెక్టర్ గరిమా అగ్రవాల్ , జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డిలు సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీపిటీఎఫ్ రాష్ట్ర సీనియర్ నాయకులు జి.తిరుపతి రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ. భాస్కర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు సిహెచ్ విజేందర్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్స్ జి.జానకి రాములు, ఆర్ పద్మయ్య, జె.విష్ణువర్ధన్, జిల్లా ఉపాధ్యక్షులు ఎ.సత్యనారాయణ, పి.జనార్ధన్ రెడ్డి, యస్.నరెందర్, ఎ.నరసింహ రెడ్డి, జిల్లా కార్యదర్శులు యండి మహమూద్, ఆర్ మల్లేశం, జి.శివాజి, జి.విద్యాసాగర్, నాయకులు మహేందర్, రాములు, ఎ.రాంచంద్రం, జి.సుధాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం

నవ తెలంగాణ - సిద్దిపేట

మంగళవారం ఉదయం 10.30 గంటలకు సాధారణ జెడ్పీ సర్వసభ్య సమావేశం విపంచి కళా నిలయములో నిర్వహించడం జరుగుతుందని జెడ్పీ చైర్ పర్సన్ వేలేటి రోజా రాధాకృష్ణ శర్మ తెలిపారు. ఆమె మాట్లాడుతూ జడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా అధికారులు అందరూ పాల్గొనాలని కోరారు.

జోరుగా ప్రజాపాలన దరఖాస్తుల ఆన్ లైన్



నవతెలంగాణ-అక్కన్నపేట

ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను అక్కన్నపేట మండల కేంద్రంలో ఆన్లైన్ నమోదు చేసే ప్రక్రియ జోరుగా కొనసాగుతోంది. సోమవారం మండల కేంద్రంలో 13,630 దరఖాస్తులను పరిశీలించి ఆన్లైన్ ఎంట్రీ మొదలుపెట్టారు. ఈ క్రమంలో 6985 దరఖాస్తులను టీం లీడర్ ఎంపీడీవో సత్యపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఆన్లైన్ చేపట్టారు. అలాగే 6645 దరఖాస్తులకు ఎమ్మార్వో సంజీవ్ కుమార్ ఆధ్వర్యంలో ఆన్లైన్ చేపట్టారు.

కొనసాగుతున్న ఆన్లైన్ ప్రక్రియ

- గడువులోపే పూర్తి చేస్తాం
- మండల ప్రత్యేక అధికారి జిల్లా మత్స్యశాఖ అధికారి మల్లేశం

నవ తెలంగాణ దౌల్తాబాద్

ప్రజాపాలనకు వచ్చిన తొమ్మిది వేల రెండు వందల ముప్పై ఐదు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని మండల ప్రత్యేక అధికారి జిల్లా మత్స్యశాఖ అధికారి మల్లేశం తెలిపారు. దౌల్తాబాద్‌లో 974 దరఖాస్తులు, లింగరాజు పల్లి 172,అప్పాయపల్లి 159, మాచినపల్లి 435, షేర్ పల్లి



బందారం 534, చెట్ల నర్సంపల్లి 330, ముబారస్ పూర్ 446, ఇందుప్రియల 625, కోనయ పల్లి 262, గోవిందాపూర్ 341, తిరుమలపూర్ 599, గువ్వలేగి 203, గొడుగుపల్లి 384, ఉప్పరపల్లి 399, దీపాయంపల్లి 194, ముత్యంపేట 155, లింగాయపల్లి తాండ 177, సూరంపల్లి 603, మామషాపూర్ 194, దొమ్మాట 768, కోనా పూర్ 137, గాజులపల్లి 55, మల్లేశంపల్లి 169, హైమత్ నగర్ 194 దరఖాస్తులు వచ్చాయన్నారు. తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో రాజేష్‌కుమార్ రెండు టీంలుగా పనులు జరుగుతున్నాయని అన్నారు.

ఇంటింటికి అయోధ్య శ్రీరాముని అక్షింతల పంపిణీ

నవ తెలంగాణ- రాయపోల్

రాయపోల్ మండల కేంద్రంలో సోమవారం శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర బాధ్యులు ఇంటింటికి అయోధ్య శ్రీరాముని అక్షింతలను పంపిణీ చేశారు. ఆంజనేయ స్వామి ఆలయంలో అర్చకులు వెంకటేశ్వర శర్మ, మాణిక్య ప్రభు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులు భజనలు కీర్తనలు పాడుతూ ఇంటింటికి తిరిగి అయోధ్య రాముని అక్షింతలతో పాటు, భవ్య రామ మందిర నిర్మాణ నమూనా చిత్రపటం, కరపత్రాన్ని అందజేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రామాలయ కమిటీ ఆధ్వర్యంలో ఇంటింటికి శ్రీరాముని అక్షింతలు పంపిణ చేశారు.ఈ మోహన్ రెడ్డి దయాకర్ రెడ్డి, రాజు గౌడ్, తిరుపతి రెడ్డి, లింగారెడ్డి, బాల లక్ష్మి, యాదవ్ రెడ్డి, బాలా చారి, బాల్ రెడ్డి, సజన్ లాల్, నాగరాజు, స్వామి తదితరులు పాల్గొన్నారు.



ప్రాణాలు కాపాడిన పోలీసులు

నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి గ్రామానికి చెందిన పెండెల కవిత(35) కు అక్కన్నపేటకు వెళుతున్న సమయంలో గుండెపోటు వచ్చింది. మార్గమధ్యంలో కుప్పకూలిపోయింది. అటుగా వెళుతున్న రాగి శ్రీనివాస్ యువకుడు పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న కానిస్టేబుల్స్ రమేష్, యాదగిరి మహిళకు సీపీఆర్ అందించారు.

ఒక ప్రైవేటు వాహనంలో ఆసుపత్రికి తరలించారు. దీంతో మహిళ సురక్షితంగా ప్రాణాపాయం నుంచి బయటపడింది. సకాలంలో స్పందించిన పోలీసులకు కవిత భర్త కుమారస్వామి కృతజ్ఞతలు తెలియజేశారు. పోలీసులు సమయానికి రాకపోతే ప్రాణాలు పోయేవని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కవిత ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని అన్నారు.



మంత్రికి కృతజ్ఞతలు

నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండల పరిధిలోని చౌడు తండా, బోధరువాగు తండా, మజ్యానాయక్ తండాలలో గత కొన్నిళ్ళుగా మంచినీటి సమస్య ఉందని సర్పంచ్ ముత్యాల సంజీవరెడ్డి అన్నారు. నీటి సమస్య విషయమై బీసీ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లగానే మిషన్ భగీరథ డిఈకి ఆదేశాలు జారీ చేసి సమస్య క్లియర్ చేయాలని చెప్పారు అని తెలిపారు.

వెంటనే స్పందించిన డిఈ అట్టి గ్రామాలకు కన్నారం వైపుగా వెళుతున్న మిషన్ భగీరథ మెయిన్ లైన్ నుంచి కలెక్షన్ అందించి తండాలకు నీరు వచ్చేలా చేశారని సంజీవరెడ్డి అన్నారు. సమస్య క్లియర్ చేసిన మంత్రి కృతజ్ఞతలు తెలియజేశారు.



ప్రజావాణి సమస్యలు వెంటనే పరిష్కరించాలి

జిల్లా అదనం కలెక్టర్ గరిమా అగర్వాల్



నవ తెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని జిల్లా అదనం కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డితో కలిసి జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) గరీమా అగర్వాల్ అర్జిదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో డిఆర్ఓ నాగరాజమ్మ, డిఆర్డిఎ పిడి జయదేవ్ ఆర్యా, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌యుటిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరించిన డీఈఓ

నవతెలంగాణ-సిద్దిపేట

టీఎస్ యుటిఎఫ్ సిద్దిపేట జిల్లా క్యాలెండర్, డైరీని సిద్దిపేట జిల్లా విద్యాధికారి ఈ. శ్రీనివాసరెడ్డి సోమవారం సాయంత్రం టీఎస్ యుటిఎఫ్ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అదేవిధంగా జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్, జిల్లా ఖజానాధికారి బాలరాజుకి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అందజేసినట్లు టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్కే వలి హమ్మద్, తప్పెట్ల యాదగిరిలు తెలిపారు. . ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు చిర్ర యాదగిరి, జిల్లా కోశాధికారి ఎం .కృష్ణ, జిల్లా కార్యదర్శులు సి. చంద్రారెడ్డి, జి. వెంకట కిరణ్, కె. ప్రశాంత్ కుమార్, ఎం.రవీందర్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ టీ.శివలింగం, జిల్లా ప్రచురణల కమిటీ కన్వీనర్ ఈ.తిరుపతి, జిల్లా కమిటీ సభ్యులు సియెచ్. కృష్ణ, రాజనర్సింహ, పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

